

రేపటి నుంచి భూముల విలువల సవరణ

» జిల్లాలో 3 నుంచి 15 శాతం పెంపు

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలు అమలులోకి వస్తాయని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు గురువారం తెలిపారు. అన్నింటినీ పరిశీలించి తుది విలువలు రూపొందించామని, అవి శనివారం నుంచి అమలులోకి వస్తాయన్నారు. జిల్లాలో భూముల ధరలు మూడు శాతం నుంచి 15 శాతం వరకు పెరిగాయని, కొన్ని ప్రాంతాల్లో అసలు మార్పులే చేయలేదన్నారు. ఎక్కడైతే ఎక్కువ అభివృద్ధి జరుగుతున్నదో అక్కడే విలువలు పెంచామని చెప్పారు.

ప్రైవేటీకరణ ప్రతిపాదన గడిచిన చరిత్ర

స్టీల్‌ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసిందంటే పునర్నిర్మాణం కోసమే...

- » ఉద్యోగులు, కార్మికులు అర్థం చేసుకోవాలి
- » కొంతకాలంగా అనేక కష్టాలు పడుతున్నారు, త్యాగాలు చేశారు... అన్నీ మాకు తెలుసు
- » మరింత కష్టపడి 100 శాతం ఉత్పత్తి సాధిద్దాం
- » ఏడాదిలోగా కష్టాలు తొలగిపోయి మంచి రోజులు వస్తాయి
- » కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్.డి.కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ
- » కర్మాగారంలో ఉన్నతాధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఉద్యోగులు గత కొంతకాలంగా అనేక కష్టాలు పడుతున్నారని, అనేక త్యాగాలు కూడా చేశారని, అవన్నీ తమకు తెలుసునని, ఇదే స్ఫూర్తితో మరింత కష్టపడి ప్లాంటు ఉత్పత్తిని 100 శాతానికి చేర్చాలని కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మలు కోరారు. స్టీల్‌ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన తరువాత తొలిసారిగా గురువారం విశాఖపట్నం వచ్చిన వారికి కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి స్టీల్‌ప్లాంటుకు వెళ్లేంత వరకూ అడుగడుగునా పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు కర్మాగారంలోని ఎల్ అండ్ డీసీలో ఉన్నతాధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్లాంటు ప్రైవేటీకరణ గురించి ఇంకా చాలామంది మాట్లాడుతున్నారని, అది గడిచిన చరిత్ర అని పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి కుమారస్వామికి హారతి ఇస్తున్న మహిళ. చిత్రంలో సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఉన్నారు.

పెట్టుబడుల ఉపసంహరణకు 2021లో కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని పక్కనపెట్టి మరీ కేంద్రం ఆర్థిక సాయం చేసిందంటే... ప్లాంటు పునర్నిర్మాణం కోసమేనని, దీనిని కార్మికులు, ఉద్యోగులు అర్థం చేసుకోవాలన్నారు. అందివచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత కష్టపడి రోజుకు 21 వేల నుంచి 24 వేల టన్నుల ఉత్పత్తి సాధిస్తే కష్టాలన్నీ తీరిపోతాయన్నారు. ఏడాదిలోగా కష్టాలు తొలగిపోయి మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. నెల నెలా జీతాలు ఇవ్వలేని పరిస్థితి కూడా ఇంకో మూడు నెలలే ఉంటుందని, ఆ తరువాత ప్రతి నెలా జీతాలు ఇచ్చే ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. సెయిల్‌లో విలీనం కంటే ముందు ప్లాంటును నిలబెట్టడంపైనే దృష్టి కేంద్రీకరించామన్నారు. సొంత గనుల కోసం కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని, అన్నీ ఒకేసారి రావని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వచ్చిన నిధులు ఎలా సద్వినియోగం చేసుకోవాలో అధికారులకు దిశానిర్దేశం చేస్తామన్నారు. ప్లాంటుకు ఆర్థిక ప్యాకేజీ అందడంలో స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రీ పాత్ర కూడా ఉందని, సీఎండీ సక్సేనా కూడా ఈ నాలుగు నెలలు ప్లాంటును సమర్థంగా నిర్వహిస్తూ వచ్చారని ప్రశంసించారు. ఉద్యోగులు, కార్మికులు అన్ని కష్టాలకు ఓర్చుకొని, సంయమనంతో రోజుకు 14 వేల టన్నులు ఉత్పత్తి తీస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని కోరారు.



స్టీల్‌ప్లాంటులో ఉద్యోగులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కుమారస్వామి. చిత్రంలో సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, ఉక్కు అధికారులు ఉన్నారు

విశాఖ స్టీల్‌ప్లాంటుకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలని తిరుమల వెంకటేశ్వరస్వామిని ప్రార్థించానని కుమారస్వామి అన్నారు. సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంటుకు కేంద్రం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. ఈ సమావేశంలో విశాఖ, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, కె.అప్పలనాయుడు, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, స్టీల్ ప్లాంటు డైరెక్టర్లు ఏకే బాగ్చీ, ఎస్‌సీ పాండే, ఎస్ఆర్‌వీజీకె గణేష్, జీవీఎస్.ప్రసాద్, సీవీవో కరుణరాజు, ఉక్కు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదరి సంజయ్‌రాయ్, సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీవిశ్వనాథరాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహరావు, అధికారులు, నాయకులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో బరితెగింపు

అడ్డగోలుగా వ్యవహరిస్తున్న జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం

- » బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగింత
- » ఓ అధికారి సహకారం
- » వారి టెండర్లను అనుమతించాలని డీబీలకు ఆదేశం
- » పనులు చేయకపోయినా బిల్లులు చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందని ఆరోపణలు
- » విజిలెన్స్ అధికారులు దృష్టిసారిస్తే అక్రమాలు బట్టబయలయ్యే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పనుల్లో నాణ్యత ఉండడం లేదని, సకాలంలో పూర్తిచేయకపోతున్నారని జీవీఎంసీ కమిషనర్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన కాంట్రాక్టర్లు తిరిగి టెండర్లలో పాల్గొంటున్నా... ఇంజనీరింగ్ విభాగం అధికారులు అండదండలు అందిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పూర్తిస్థాయిలో పనులు చేయకపోయినా బిల్లు చెల్లించేలా ముందస్తు ఒప్పందం కూడా కుదిరినట్టు తెలుస్తోంది.

జీవీఎంసీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, భవనాలు, ప్రహరీల నిర్మాణం, పార్కులు, ల్యాండ్ స్కేపింగ్, పచ్చదనం పెంపు వంటి పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తుంటారు. పని విలువను బట్టి అర్హత, అనుభవం కలిగిన కాంట్రాక్టర్లకు మాత్రమే టెండర్ వేసేందుకు అధికారులు అనుమతిస్తారు. పని దక్కించుకున్న కాంట్రాక్టర్ జీవీఎంసీతో అగ్రిమెంట్ చేసుకున్న తర్వాత సకాలంలో పని పూర్తిచేయడంలో విఫలమైనా, నాణ్యత లోపించినా...ఇంజనీరింగ్ అధికారుల సిఫారసు మేరకు కమిషనర్ ఆయా కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. కమిషనర్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్న కాలపరిమితి ముగిసేంత వరకూ వారు జీవీఎంసీ టెండర్లలో పాల్గొనడానికి వీలుండదు. జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలో నాయకుడిగా చలామణీ అవుతున్న కాంట్రాక్టర్ ఒకరు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడంతో గతంలో కమిషనర్‌గా పనిచేసిన లక్ష్మీషా 2026 వరకూ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేశారు. అయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ తాను యూనియన్‌లో నాయకుడినని అధికారులను బెదిరించి టెండర్లలో పాల్గొంటున్నారు. అదేమాదిరిగా ఇద్దరు స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు తమ భార్యల పేర్లతో లైసెన్స్ పొంది హార్టికల్చర్ విభాగంలో పనులు చేపడుతున్నట్టు గత ఏడాది సెప్టెంబరులో 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించడంతో అప్పటి కమిషనర్ సంపత్‌కుమార్ స్పందించి వారిద్దరినీ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. హార్టికల్చర్, ఇంజనీరింగ్ అధికారులను పిలిచి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన వారి టెండర్లను అనుమతిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ ఇటీవల జోన్-2 పరిధి తోటగరువు ఉన్నత పాఠశాల ఆవరణలో ఎర్రమట్టి వేసేందుకు రూ.7.8 లక్షల అంచనా వ్యయంతో, జోన్-5 పరిధి పాస్‌పోర్ట్ కార్యాలయం ఎదుట గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌లో ఎర్రమట్టి నింపేందుకు రూ.16.58 లక్షలతో టెండర్లు పిలవగా దాదాపు 34 శాతం లెస్‌కు వేసి మరీ బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న స్టీల్‌ప్లాంటు ఉద్యోగి భార్య పనులు దక్కించుకోవడం విశేషం.



బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నా సరే యథేచ్ఛగా టెండర్లు

బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నప్పటికీ జోన్-5 పరిధిలో వార్డు సచివాలయ భవన నిర్మాణానికి కాంట్రాక్టర్ల సంఘం నేత టెండర్ వేశారు. టెండర్ వేసినప్పటికీ టెక్నికల్ బిడ్‌ను తెరిచినప్పుడు ఇంజనీరింగ్ విభాగంలోని సంబంధిత జోన్ డ్రాయింగ్ బ్రాంచ్ (డీబీ) తిరస్కరించాలి. కానీ అటువంటిదేమీ లేకుండా...అందరి కంటే ఎక్కువ ... మిగతా 6వ పేజీలో




సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా. చిత్రంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఉన్నారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం వీఐపీ రోడ్డులో గల మంత్రీస్ హోటల్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా ప్రస్తుతంలో దేశంలో రాజకీయ పరిస్థితి, సీపీఐ కర్తవ్యం, తదితర అంశాలపై మాట్లాడారు. సమావేశంలో జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అని రాజా, అమర జీత్ కౌర్, బాలచందర్ కాంగో, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

- సిరిపురం, ఆంధ్రజ్యోతి

మహాత్ముడికి ఘన నివాళి



జాతిపిత గాంధీ వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, అధికారులు.



జీవీఎంసీ బడ్జెట్ సమావేశానికి కోడ్ అడ్డంకి

» మార్చి నెల ఎనిమిదో తేదీ వరకూ అమలు

- » ఏం చేయాలో అర్థంకాక అధికారుల మల్లగుల్లాలు
- » సవరణ బడ్జెట్‌కు బ్రేకులు
- » నగరంలో అభివృద్ధి పనులపై ప్రభావం పడే అవకాశం

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.4,554.27 కోట్ల బడ్జెట్ ముసాయిదాను జీవీఎంసీ అధికారులు రూపొందించారు. దీనిని స్టాండింగ్ కమిటీ స్వల్ప సవరణలతో గత నెల 20న ఆమోదించింది. జనవరి మొదటి వారంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి భావించారు. అయితే ఈనెల ఎనిమిదిన ప్రధాని నరేంద్రమోదీ నగరానికి రావడంతో సమావేశం నిర్వహణ సాధ్యపడలేదు. తర్వాత సంక్రాంతి హడావుడి మొదలవడంతో పండుగ తర్వాత బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలనుకున్నారు. 29న బడ్జెట్ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ అధికారులకు మేయర్ సూచించారు. ఈలోగా కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ఈనెల 21న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌ను జీవీఎంసీ అధికారులు కలిసి బడ్జెట్ సమావేశం ఏర్పాటు అంశం ప్రస్తావించగా, కొత్త కమిషనర్ నియామకం ఈనెల 31లోగా జరిగే అవకాశం ఉన్నందున కొద్దిరోజులు ఆగాలని సూచించారు. అప్పటికీ కమిషనర్‌ను ప్రభుత్వం నియమించకపోతే ఒక తేదీ నిర్ణయించే అంశంపై చర్చిద్దామని వివరించారు. అయితే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రభుత్వం బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మార్చి ఎనిమిదో తేదీ వరకు అమలులో ఉంటుంది. కోడ్ ఉండగా బడ్జెట్ సమావేశం నిర్వహణకు అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఏటా జనవరిలోనే ముగిసే బడ్జెట్ సమావేశం ఈసారి ఆర్థిక సంవత్సరం చివరిలో నిర్వహించుకోవలసి వస్తుందని అధికారులు చెబుతున్నారు. కొత్త బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించకపోతే 2024-25 సవరణ బడ్జెట్‌ను అమలు చేయడానికి కూడా అవకాశం ఉండదని చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని విభాగాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఖర్చయిపోయినందున, కొత్త పనులు చేపట్టేందుకు వీలుండదని, దీని ప్రభావం నగర అభివృద్ధి, ఇతర కార్యక్రమాల నిర్వహణపై పడుతుందని పేర్కొంటున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి కోసం లేఖ రాస్తే ఏమైనా వెసులుబాటు లభిస్తుందేమోనని అధికారులు ఆలోచిస్తున్నారు.



ఆరు జిల్లాల్లో ఎన్నికల కోడ్

- » ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలకు వచ్చే నెల 3 నుంచి నామినేషన్లు స్వీకరణ
- » 27న పోలింగ్, 3న ఓట్ల లెక్కింపు
- » ఓటు నమోదుకు నేటి సాయంత్రం వరకూ అవకాశం
- » ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పర్యవేక్షణకు 23 బృందాలు
- » ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలి
- » ఎన్నికల అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్



- 6వ పేజీలో

శతాబ్ది ఉత్సవాలకు సన్నద్ధం

- వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న సరస్వతీ నిలయం
- ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఉత్సవం
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు పూర్వ విద్యార్థుల కమిటీ, ప్రభుత్వం పరస్పర అవగాహనతో కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేస్తుండగా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రత్యేక పర్యవేక్షణలో జిల్లా విద్యా శాఖాధికారులు ఉత్సవ నిర్వహణపై సమీక్షిస్తున్నారు.

భీమిలి ఉన్నత పాఠశాలకు వందేళ్లు

భీమునిపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అప్పట్లో భీమిలి పురపాలక సంఘం పరిధిలో ఆరు ప్రాథమిక పాఠశాలలు, వయోజన విద్యా కేంద్రం ఉండేవి. వాడుక భాషతో పాఠాలు బోధించే మరో పాఠశాల నడిచేది. చిలకా సంజీవరావునాయుడు మునిసిపల్ ఛైర్మన్‌గా ఉన్న 1921లో మరో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థుల సంఖ్య 566కు పెంచారు. 1924లో ప్రాథమిక పాఠశాలను మునిసిపల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌గా ఉన్నత పాఠశాలగా అప్పటి జిల్లా కలెక్టర్ జీటీహెచ్ బ్రాకెన్ దీన్ని అప్‌గ్రేడ్ చేశారు. 1968లో ఈ పాఠశాలను ప్రభుత్వం ఆధీనంలోనికి తీసుకుంది. తరువాత ఇదే ఆవరణలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. హైస్కూల్‌కు వందేళ్లు పూర్తవడంతో తాజాగా శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభించారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జరిగే ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా నృత్యాల రిహార్సల్స్ చేస్తున్నారు. వేడుకలకు పాఠశాల భవనాలను రంగులతో అద్దుతున్నారు. వందేళ్ల ఉత్సవాలకు గుర్తుగా పైలాన్ నిర్మించారు. ఇప్పటికే ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గాడు అప్పలనాయుడు, కార్యదర్శిగా షైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారిగా పూసర్ల శ్రీనివాసరావు, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు మొత్తం 365 మంది విద్యార్థులు చదువుతున్నారు.


ప్రభుత్వ ఉన్నత కళాశాల ముఖ ద్వారం


ఉత్సవానికి సిద్ధం చేస్తున్న వేదిక

దాతల వితరణ

ఉన్నత పాఠశాలలో కనీస సదుపాయాలు కల్పించేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు గాంధీ విగ్రహాన్ని బహూకరించారు. కట్టమూరి సావిత్రి, లక్ష్మీ కాంతం (ఆనందం) జ్ఞాపకార్థం వారి కుమారులు 2018లో రెండు ఆర్వో ప్లాంట్‌లను అందజేశారు. 1978-81 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఇన్‌కమ్‌టాక్స్ అడిషినల్ కమిషనర్ వి.ఎం.మహీధర్, 30 మంది స్నేహితులు రూ.18.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.

ఉన్నత స్థానాలకు ఎదిగిన వారెందరో...

పాఠశాలలో చదువుకున్న మాజీ మంత్రి రాజాసాగి దేవి ప్రసన్న అప్పలనరసింహరాజు నాలుగుసార్లు భీమిలి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కలిగొట్ల సూర్యనారాయణమూర్తి బీఎస్ఎఫ్ కమాండెంట్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఇన్‌కమ్ టాక్స్ అడిషినల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మహీధర్ ఈ పాఠశాల పూర్వ విద్యార్థి. ఐపీఎస్ గడిదేశి క్రాంతికుమార్, జీఎంఆర్ గ్రూప్ (ఆర్‌ఏఎక్స్‌ఏ) సలహాదారు కట్టమూరి పోతన్నశెట్టి, కాకినాడ షిప్‌యార్డు డిప్యూటీ జనరల్ మేనేజరు గడిదేశి వెంకట వరహారమేష్, గంగవరం పోర్టులో కస్టమ్స్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కె. రవిశంకర్, విశ్రాంత ఏఎస్పీలు మీసాల మాధవరావు ఇక్కడే చదువుకున్నారు. ఇక్కడే విద్యాభ్యాసం చేసి, 2019 నుంచి 21 వరకు హెచ్‌ఎంగా చిల్ల సూర్యనారాయణ పనిచేశారు. విశాఖ షిప్‌యార్డు విశ్రాంత చీఫ్ మేనేజరు ఉసిరికల బంగార్రాజు కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నారు.

అభివృద్ధి పథంలో పాఠశాల



పాఠశాల విద్యార్థులు గత మూడేళ్లలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. 2021-22లో 47 మంది పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. అలాగే 2022-23లో 56 మంది, 2023-24లో 63 మంది పరీక్షలకు హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణత లభించింది. పాఠశాలలో నాతో పాటు 11 మంది స్కూల్ అసిసెంట్లు, ముగ్గురు నాన్ టీచింగ్ స్టాఫ్ పని చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉత్సవాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నా హయాంలో పాఠశాల వందేళ్ల వేడుకలు జరగడం ఎంతో ఆనందంగా ఉంది.

- పొన్నగంటి రమణ, హెచ్ఎం

వచ్చే నెల అప్పన్న ఆలయంలో జరిగే ఉత్సవాలు

సింహాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో మాఘ మాసంలో జరిగే ఉత్సవాలను దేవాలయం అధికారులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వచ్చే నెల 4న సూర్య జయంతి సందర్భంగా ఉదయం స్వామివారి స్నపన తిరుమంజనం, విశేష ఆరాధనలు ఉంటాయి. సాయంత్రం సూర్యప్రభ వాహనంపై సింహగిరి మాడవీధుల్లో తిరువీధి, 7,8వ తేదీల్లో సింహాచలం దేవస్థానం అనుబంధాలయాలు కొండదిగువ వేంకటేశ్వరస్వామి, మాధవధారలోని వేణుగోపాలస్వామి,సింహగిరి క్షేత్రపాలకుడు బాల త్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలు, 10న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణం హవనం,11న స్వామివారి మాస జయంతి, 12న మాఘ పూర్ణిమ పురస్కరించుకుని అనుబంధ దేవాలయాల్లో అవబృదోత్సవం, 13న కుంభ సంక్రమణం సందర్భంగా అనుబంధాలయాల్లో పుష్ప యాగం, 14న సింహవల్లీ తాయార్ బేడ మండప తిరువీధి,పుబ్బ ఆండాళ్ మాస తిరు నక్షత్ర పూజలు జరగనున్నాయి. అలాగే 19న స్వాతి హవనం, 20న విశాఖ నక్షత్రం నమ్మాళ్వార్ తిరునక్షత్రం, 23న మూల నక్షత్ర మనవాళ్ల మహామునుల తిరు నక్షత్రం, 24న మాఘమాస బహుళ ఏకాదశి స్వామివారికి స్వర్ణ తులసీదళార్చన, మాడవీధుల్లో తిరువీధి, 26న మహాశివరాత్రి, 28న మాఘమాస బహుళపక్ష అమావాస్య, గ్రామ బలిహరణం, గ్రామ తిరువీధి నిర్వహించనున్నారు.


కమిషనర్ రామచంద్రమోహన్‌ను కలిసిన ఈఓ త్రినాథరావు, తదితరులు

దేవదాయ శాఖ కమిషనర్‌కు అభినందనలు

సింహాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ కమిషనర్ కోడూరి అచ్యుత రామచంద్రమోహన్ గురువారం సింహాచలం దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో ట్రాన్సిట్ హాల్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయస్వామి దేవస్థానంలో జరిగే రథసప్తమి వేడుకల ఏర్పాట్లకు సంబంధించి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ ఆ సమావేశానికి వెళుతూ మార్గమధ్యలో కొంతసేపు సింహాచలంలో ఆగారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ఈ ప్రాంతానికి రావడంతో దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్, వేద పండితుడు గోదావరి సురేశ్ శర్మ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి వేద మంత్రాలతో ఆశీర్వచనాలిచ్చారు. అలాగే జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కార్యాలయ సిబ్బంది, విజయనగరం జిల్లా సహాయ కమిషనర్ వై. శ్రీనివాసరావు, తదితరులు కూడా మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

శతాబ్ది ఉత్సవ్ షెడ్యూల్

భీమునిపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల షెడ్యూల్‌ను నిర్వహణ కమిటీ గురువారం రాత్రి విడుదల చేసింది. 1వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం ముఖ్య అతిథులు ఉత్సవ్ జెండాను, పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ఉన్నత పదవుల్లో ఉన్న పూర్వ విద్యార్థులకు, హైస్కూల్ ఉపాధ్యాయులకు సన్మానం, సాయంత్రం 4 నుంచి 6.30 వరకూ ఊరేగింపు, బీచ్‌రోడ్‌లో రతన్ టాటా విగ్రహావిష్కరణ జరగనున్నాయి. 2న ఉదయం 6 నుంచి 9 వరకూ పూర్వ విద్యార్థులకు ఆటల పోటీలు, 10 నుంచి మధ్యాహ్నం 2 వరకూ హైస్కూల్ నిర్వహించే ఉత్సవ్ కార్యక్రమాలు, ముఖ్య అతిథుల ఉపన్యాసాలు వుంటాయి. ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీభరత్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గోలా బాల వీరాంజనేయస్వామి,మాజీ మంత్రి, పాఠశాల పూర్వ విద్యార్థి అప్పలనరసింహరాజు హాజరుకానున్నారు. విశిష్ట గౌరవ అతిథులుగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఆర్‌జేడీ విజయ భాస్కర్,డీఈవో ప్రేమ్‌కుమార్ పాల్గొంటారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎంలు విజయ, ఇందిర

తగరపువలస, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అమనాం, పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు దివీస్ యాజమాన్యం గురువారం స్టడీ మెటీరియల్ అందించింది. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఏఆర్ విజయ, ఇందిర ఆధ్వర్యంలో 97 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, దివీస్ కంపెనీ సీఎస్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం

ఎండాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎండాడలోని దసపల్లా లేఅవుట్‌లో కొలువుదీరిన బంగారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారికి ఉదయం పూజలు, కుంకుమార్చనలు, పంచామృత అభిషేకాలు జరిపి భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మవారిని, ఆలయ ఆవరణాన్ని సుందరంగా అలకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మిథిలాపురి వుడాకాలనీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోర్టు కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, సుద్దగెడ్డ ప్రాంతం, వాంబే కాలనీ, శ్రీనివాసా నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

కొమ్మాది పరిధిలో...

కొమ్మాది : కొమ్మాది సబ్ స్టేషన్ 11 కేవీ సేవానగర్ ఫీడర్, కొమ్మాది 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కొమ్మాది ఏఈ నరేశ్ తెలిపారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసా నగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సేవానగర్, డ్రైవర్స్ కాలనీ, కొమ్మాది, దేవిమెట్ట, ఓజోన్ వ్యాలీ, కుక్కల కంపెనీ, మారికవలస మెట్రో, చైతన్య పాఠశాల, పోలాక్, గురుకుల పాఠశాలల ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని బోని 33/11 కేవీ ఫీడరులో లైన్ మరమ్మతు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపేటకు సరఫరా ఉండదన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

మధురవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీలో 40 మంది క్షయ రోగులకు వైద్యాధికారి ప్రశాంతి గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ రోగులు సకాలంలో మందులు వేసుకోవడంతో పాటు బలమైన ఆహారం తీసుకున్నప్పుడే త్వరగా కోలుకుంటారని చెప్పారు.

పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం పట్ల హర్షం

ఆనందపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపడం హర్షనీయమని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. గురువారం ఆయన ఆనందపురంలో విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోగా కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

50 బియ్యం బస్తాలు విరాళం

సింహాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ప్రముఖ సినీ నిర్మాత కొర్రపాటి సాయి 72 బియ్యం బస్తాలు వితరణగా అందించారు. ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్‌కు సాయి ప్రతినిధులు గురువారం వీటిని అందజేశారు.

యువత గాంధీజీ మార్గంలో నడవాలి

మహాత్ముడి వర్ధంతి సభల్లో వక్తలు

భీమునిపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సభలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువత గాంధీజీ మార్గంలో నడిచి దేశాభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. భీమిలి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వైసీపీ పట్టణ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో గాంధీజీ పార్కులో మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

మధురవాడ : స్వతంత్రనగర్ కాలనీలో ఉన్న గాంధీజీ విగ్రహానికి మధురవాడ పౌర సంక్షేమ సంఘం సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ యువత మహాత్ముడి అడుగుజాడల్లో నడిచి సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

పద్మనాభం రూరల్ : మండలంలోని పాండ్రంగి గ్రామంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ నాయకులు మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంతి అప్పలరమణ. (శ్రీను), మాజీ సర్పంచ్ పల్లి మహేశ్, కె. అప్పలనాయుడు, బి. సతోష్, కె.రమణ, బర్నాల శ్రీనివాసరావు, పద్మనాభ రాజు, పి. శ్రీనివాసరావు, కె. గణేశ్ బాబు, పి. సారధి పాల్గొన్నారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు వైసీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు సారధ్యంలో గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహానికి పలువురు పుష్పమాలికలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ చిత్రపటం వద్ద నివాళి

ఆనందపురం : యువత మహాత్మా గాంధీ అడుగుజాడలో నడిచి దేశాభివృద్ధికి కృషి చేయాలని వేములవలస పంచాయితీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ చేసిన కృషిని కొనియాడారు.

కొమ్మాది : మహాత్మా గాంధీ శాంతియుత పోరాటం వల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని వక్తలు కొనియాడారు. చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, పిళ్లా సూరిబాబు, జగ్గుపల్లి నరేశ్, జనసేన నాయకులు పిళ్లా శ్రీను, జగ్గుపల్లి నాని, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

భీమునిపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు పొందాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. గురువారం ప్రభుత్వ జూనియరు కళాశాలలో కృష్ణంరాజుపేటకు చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ మెడికల్ సెంటర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ సూరిబాబు ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, కె. నాయుడు, వి. గుణ, జి. సంధ్య, డి.ప్రవల్లిక, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా శ్రవణ నక్షత్ర హవనం

సింహాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి కొండదిగువన పూతోటలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర హవనం గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి సేవాకాలం జరిపారు. యజ్ఞ ఆది దేవుడుగా సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి శాస్త్ర విధానంలో బింబారాధన, కలశారాధన, మండపారాధన జరిపారు. అనంతరం ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్టాపన చేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ ఆధ్వర్యంలో తొలుత పంచసూక్తాలతో, అనంతరం మూల, మూర్తిమంత్రాలతో వేద పండితులు హవనాన్ని జరిపి, మహాపూర్ణాహుతి నిర్వహించారు.

మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పద్మనాభం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మొక్క జొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తెగుళ్ల, పురుగులను నివారించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పారు. గురువారం వారు కృష్ణాపురం, పాండ్రంగి, మద్ది గ్రామాల్లో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష, విశాలాక్షి, ఏఓ చలం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

'వైసీపీ బలోపేతానికి కృషి'

పద్మనాభం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) :నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పిలుపునిచ్చారు. గురువారం రెడ్డిపల్లిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ తనపై ఉన్న నమ్మకంతో భీమిలి నియోజకవర్గానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అధ్యతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, జడ్పీ వైస్ ఛైర్మన్ సుంకరి గిరిబాబు, ఆనందపురం జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు,భీమిలి, ఆనందపురం మండలాల అధ్యక్షులు గాడు శ్రీనివాసరావు, బంక సత్యనారాయణ. నాయకులు దాట్ల పెదబాబు, బుగత సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణ వారోత్సవాలు ప్రారంభం

సాగర్‌నగర్/ఎండాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలోని డీవీఎల్ విభాగం ఆధ్వర్యంలో కుష్ఠు నివారణ వారోత్సవాలను జిమ్సర్ ప్రొ వైస్ ఛాన్సలర్ డా. గీతాంజలి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గీతం డెర్మటాలజీ విభాగాధిపతి బీవీ రామచంద్ర మాట్లాడుతూ ప్రపంచంలో ఏటా 2 లక్షల మంది కుష్ఠు వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. ముందుగా వ్యాధి లక్షణాలను గుర్తిస్తే సరైన చికిత్స ద్వారా నివారణ సాధ్యపడుతుందన్నారు. జిమ్సర్ ఆధ్వర్యంలో వచ్చే నెల 6 వరకు చర్మ వ్యాధుల పరీక్ష లను ఉచితంగా నిర్వహించనున్నట్టు చెప్పా రు. భీమిలిలోని గీతం ఆరోగ్య కేంద్రంలో కూడా ఈ సేవలు పొందవచ్చునని తెలిపారు.

భార్యా, బిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు

ఎండాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తన భార్యా, బిడ్డలు కనిపించడం లేదని ఓ వ్యక్తి పీఎంపాలెం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దాకమర్రి నీలయ్య (34), భార్య ధనలక్ష్మి (30), ఇద్దరు కుమారులు హర్షవర్ధన్ (9), గౌతమ్ (7)తో కలిసి మధురవాడ బక్కనపాలెం రామాలయం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారి స్వగ్రామం రణస్థలం మండలంలోని కొచ్చెర్ల. ఈనెల 25న భార్యా, భర్త మధ్య చిన్న విషయమై గొడవ జరిగింది. 29న నీలయ్య ఉపాధి నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా భార్య, కుమారులు కనిపించలేదు. కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆరు జిల్లాల్లో ఎన్నికల కోడ్

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఆరు జిల్లాల పరిధిలో కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆరోజు నుంచి విశాఖ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్టు హరేంధిర ప్రసాద్ తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్లకు గడువు దాఖలుకు ముగుస్తుందని, 11న పరిశీలన జరుగుతుందన్నారు. 13వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. 27వ తేదీన పోలింగ్ జరుగుతుందని, మార్చి మూడో తేదీన ఓటర్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.ఐదు వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే అన్ని రకాల నిబంధనలు వర్తిస్తాయని, అయితే ఎన్నికల ఖర్చు విషయంలో పరిమితి లేదని కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని స్పష్టంచేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని వివరించారు. ఆరు జిల్లాల పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. గత నెల 30వ తేదీ నాటికి 21,555 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారని, వీరిలో పురుషులు 12,948, మహిళలు 8,607 మంది ఉన్నారని వివరించారు. అర్హత కలిగిన వారంతా నామినేషన్ల దాఖలుకు పది రోజుల ముందు అంటే శుక్రవారం సాయంత్రం మూడు గంటల వరకూ ఓటు కోసం దరఖాస్తుచేసుకోవచ్చునని స్పష్టంచేశారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. పదకొండు మండలాలకు ఒక్కొక్కటి చొప్పున, అదనంగా మరొకటి కలిపి మొత్తం 12 మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు బృందాలు, ప్రతి మండలానికి ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్, జడ్పీ సీఈవో, భీమిలి, విశాఖపట్నం ఆర్డీవోలను నోడల్ అధికారులుగా నియమించినట్టు కలెక్టర్ చెప్పారు. నగర డీసీపీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ నగరంలో ఎన్నికల కోడ్ అమలుకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీశంకర్ పాల్గొన్నారు.

గ్రేటర్‌లో బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

లెస్‌కు వేశారంటూ వారికే పనులను కేటాయించేస్తున్నారు.

ఇంజనీరింగ్ ఉన్నతాధికారి అండదండలు

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 11 మంది కాంట్రాక్టర్లు బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నారు. వీరు ఎవరైనా ఏదైనా టెండర్‌లో పాల్గొంటే సంబంధిత జోన్ డీఈ వాటిని పరిశీలించి, తిరస్కరించాల్సి ఉంటుంది. కానీ వారు ఎలాంటి అభ్యంతరం చెప్పడం లేదు. పైగా వారే ఎక్కువ లెస్‌కు టెండర్ వేశారంటూ పనులు అప్పగించి అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. మిగిలిన కాంట్రాక్టర్లు ఎవరైనా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తే వారిని పరోక్షంగా అధికారులు బెదిరిస్తున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నప్పటికీ పనులు దక్కించుకుంటున్న ఇద్దరు కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ విభాగంలోని ఒక ఉన్నతాధికారి అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తిగా చేయకపోయినా బిల్లుల చెల్లింపులో అడ్డంకులు లేకుండా ఉండేందుకు సదరు అధికారి నుంచి హామీ లభించడంతోనే భారీగా లెస్‌లకు వేసి టెండర్లు దక్కించుకుంటున్నారని చెబుతున్నారు. సదరు అధికారి నేరుగా ఫోన్ చేసి ఆదేశిస్తుండడంతో తమకు మరో మార్గం లేక వారి టెండర్లను అనుమతిస్తున్నామని డీఈలు గగ్గోలుపెడుతున్నారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టిసారిస్తే భారీగా అక్రమాలు బయటపడతాయని అంటున్నారు.

పింఛన్ల పంపిణీ రేపు

» జిల్లాలో 1,60,757 మందికి రూ.69.74 కోట్లు విడుదల

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి ఒకటోతేదీ శనివారం ఉదయం సామాజిక పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ కేటగిరీలకు చెందిన 1,60,757 మందికి రూ.69.74 కోట్లు విడుదలయ్యాయి. మండలాల్లో 26,604మందికి రూ.11.14 కోట్లు, జీవీఎంసీ పరిధిలో .134,153మందికి రూ.58.6 కోట్లు పంపిణీ చేస్తారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి డబ్బులు అందజేస్తున్నారు. పూర్తిగా మంచానికే పరిమితమై నెలకు రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న 319 మందిపై అధికారుల విచారణ పూర్తయింది. వివరాలు వెల్లడించలేదు.

ఆకాశ్‌కు కలెక్టర్ అభినందనలు



విద్యార్థి ఆకాశ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ హరింధర ప్రసాద్

ఆరిలోవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గరుకుల పాఠశాలలో పదో తరగతి చదువచున్న పొన్నకాయల ఆకాష్ రూపొందించిన 'యూజ్ ఆఫ్ మేథ మెడికల్ మోడలింగ్ ఇన్ స్వచ్ఛ భారత్' అను అంశం రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. విజయవాడ మురళి రిసార్ట్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆకాశ్ రూపొందించిన ప్రాజెక్టు ప్రదర్శించాడు. పుదుచ్చేరిలో ఈ నెలలో నిర్వహించనున్న సౌత్ ఇండియా పోటీలకు అర్హత సాధించాడు. ఆకాశ్ ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్ హరేంధర ప్రసాద్ కలెక్టరేట్‌లో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ దేవాలయ హుండీ లెక్కింపు

37 రోజులకు రూ.26,34,775 ఆదాయం

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపును గురువారం ఆలయ కార్యాలయ ఆవరణలో నిర్వహించినట్టు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలియజేశారు. గడిచిన 37 రోజులకు రూ.26,34,775 నగదు వచ్చినట్టు తెలిపారు. వెండి 0-214-800 మిల్లీ గ్రాములు, యూఎస్‌ఏ 368, సింగపూర్ 12, యూఏఈ డెర్హామ్స్ 50, మలేషియా రింగిట్ 13, ఆస్ట్రేలియా 5 లభించినట్టు తెలిపారు.కార్యక్రమంలో దేవాదాయ శాఖ హుండీల సూపర్‌వైజర్ కే.గాయత్రి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, ఆలయ ఉద్యోగులు జి.గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మదగజరాజా :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **మహిష :** రమాదేవి
- **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 26 దొండకాయలు 34, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడ దుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఆ రోడ్డులో వెళ్లాలంటే హడల్

» హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాల మార్గంలో సాయంత్రమైతే సమస్యే
» వైన్ షాపు ఏర్పాటవడంతో మద్యం కొనుగోలుకు తాకిడి
» కొత్తగా ఫుడ్ దుకాణాలు వెలియడంతో మరింత రద్దీ



ఒకవైపు మద్యం దుకాణం ముందు నిలిపిన వాహనాలు, మరోవైపు రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ

వెంకోజీపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సాయంత్రం అయితే చాలు ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారుతుంది. రాకపోకలు సాగించే జనం, వాహనాల రద్దీతో ఈ రోడ్డు మహా బిజీగా మారుతుంది. ఇదీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలోని పరిస్థితి.

మార్గంలో ఓ వైన్ షాప్ వెలియడంతో సాయంత్రం వేళ రద్దీగా మారుతోంది. మద్యం కొనుగోలు చేసుకునేందుకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుంటారు. నిత్యం వాహనాల రాకపోకలు, జనం అధికంగా ఉండే ఈ ప్రాంతం వైన్ షాపు వచ్చిన తరువాత మరింతగా రద్దీగా మారింది. దీనికి తోడు ఇటీవల ఈ ప్రాంతంలో ఏర్పడిన మాంసాహార ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల కారణంగా రద్దీ మరింత ఎక్కువైంది. మహిళలు, చిన్నారులు ఈ మార్గంలో సాయంత్రం సమయంలో నడవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మద్యం షాపు ముందు నిలిపిన వాహనాలు

మహాత్ముడికి ఘన నివాళి



సిరిపురం : గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న సర్వోదయ మండల్ సభ్యులు



వెంకోజీపాలెం : ఏయూలోని గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ గాంధీజీ మార్గం అనుసరణీయం అన్నారు. ఆయన ఆచరించిన అహింసావాదం, సత్య, ధర్మ, శాంతి మార్గాలు ప్రపంచానికి గొప్ప సందేశం అన్నారు.

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నినాదం ఇవ్వడమే కాకుండా ఆచరించి చూపడం ద్వారా గాంధీజీ స్ఫూర్తిప్రదాతగా నిలిచారని, సర్వోదయ మండల్ విశాఖ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ త్రినాథ్, హేమ వెంకటేశ్వరి పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అతిథిగా పరవస్తు పద్యపీఠం వ్యవస్థాపకుడు పరవస్తు ఫణి శయనసూరి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండలి ఉపాధ్యక్షులు బీఎస్ చంద్రశేఖర్, డి.తిరుపతిరావు, ఎం.టి.రాజు, డప్పు బాను, ప్రసాద్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తత్వశాస్త్ర విభాగ పాఠ్య నిర్ణాయక సంఘ అధ్యక్షుడు డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో శాఖాధ్యక్షులు ఆచార్య వానపల్లి వెంకటరావు మాట్లాడుతూ గాంధీజీ అహింసా, సహాయ నిరాకరణ వంటి ఆయుధాలు ఈ ప్రపంచానికి అందించారని, ఈ భూమిపై ప్రేమ, దయ, సహనం ద్వారానే మానవాళి మనుగడ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ అల్లాడ వీరభద్రరావు, డాక్టర్ దేవదానం, డాక్టర్ పద్మజ, డాక్టర్ జె.శ్రీనివాసరావు, డాక్టర్ కల్యాణి, నిర్మల, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూలోని గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ మాజీ రెక్టార్, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఏయూలోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ విగ్రహానికి రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.



కృష్ణా కళాశాలలో జాతిపితకు నివాళి

ఆరిలోవలో..

ఆరిలోవ : పెదగదిలి సమీపం సింహగిరి కాలనీలో నిర్వహించిన వేడుకలో గాంధీజీకి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, ఒమ్మి అప్పలరాజు, యల్లమల్లి సురేశ్, మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మీ, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నేతలు రవిరెడ్డి, పేర్ల విజయచందర్, పాల్గొన్నారు.



ఆరిలోవలో గాంధీజీకి టీడీపీ నేతల నివాళి

మహోన్నత నాయకుడు గాంధీ : మేయర్

వెంకోజీపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సత్యం, అహింసా మార్గాలతోనే భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించి తెచ్చి పెట్టిన మహోన్నత వ్యక్తి జాతిపిత, బాపూజీ మహాత్మాగాంధీ అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోని సెంట్రల్ పార్కు వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, బిపిన్ జైన్, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) సత్యవేణి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, జోనల్ కమిషనర్ ఫణిరామ్, ఇతర అధికారులు, ఉద్యోగులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బ్రహ్మశ్రీ రమేష్‌శర్మకు సౌవర్ణ సింహితలాట కంకణ ప్రదానం



రమేష్‌శర్మకు సౌవర్ణసింహతలాట కంకణంతో సన్మానం చేస్తున్న మఠాధిపతులు, ప్రజాప్రతినిధులు

మద్దిలపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పీఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో గురువారం శ్రీరమాలక్ష్మీ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయ సహిత, ఇతర దేవాలయాల సమితుల ఆధ్వర్యంలో అక్కాజోస్యుల రమేష్‌శర్మకు సౌవర్ణ సింహతలాట కంకణ ప్రదాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాండవ కాశీ క్షేత్రత పోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిమహాస్వామి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బెందాళం అశోక్‌బాబు, సుందరపు విజయకుమార్, బొగ్గు రమణమూర్తి సమక్షంలో రమేష్‌శర్మకు స్వర్ణకంకణం బహూకరించి, సిద్ధాంత శిరోమణి బిరుదుతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంత శక్తివంతుడైనా దైవ సహాయం, దైవ సంకల్పం అవసరమన్నారు. తిరుపతి వివాదం వచ్చినప్పుడు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సనాతన సంప్రదాయ పరిరక్షణ దీక్ష చేపట్టారన్నారు. ఇటీవల చేపట్టిన హైందవ శంఖరావం వంటివి ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో అవసరమన్నారు. సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గజేంద్రమోక్షంలో మొసలి నుంచి రక్షణకు ఏనుగు దేవుడు తప్ప వేరే దిక్కులేదని ప్రార్థించినప్పుడు వెంటనే విష్ణువు వచ్చి రక్షించాడన్నారు. ద్రౌపది వస్త్రాభరణంలో కౌరవ సభలో ఎంతోమంది ఉన్నారు, ఎవరో ఒకరు రక్షిస్తారన్న ఉద్దేశంతో ద్రౌపది ఉండిపోయిందని, చివరిలో కృష్ణుడ్ని వేడుకోవడంతో భగవంతుడు రావడానికి ఆలస్యమైందని అందుకే దేవున్నే ముందు ప్రార్థిస్తే ఆయనే రక్షిస్తాడని నమ్ముతానని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ 200 ఆలయ ప్రతిష్ఠలు పూర్తిచేసిన రమేష్‌శర్మకు సౌవర్ణ సింహతలాట కంకణ ధారణ సన్మాన మహోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ రాజశేఖర్, విజయసాయిరాజు, నిమ్మనదాసు తదితరులు పాల్గొన్నారు.

1న నిర్మలాంజలి ఉత్సవం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, బాబూరావు తదితరులు

పెదవాల్తేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 1వ తేదీన మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో సహజ యోగ ధ్యాన, నిర్మలాంజలి ఫెస్టివల్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కో-ఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. గురువారం పెదవాల్తేరులోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మీడియో సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజ యోగాలు తొలుత ప్రారంభించగా, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 149 దేశాల్లో ఉచితంగా సహజ యోగ ధ్యానం కొనసాగుతోందన్నారు. స్వతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీతో కలిసి పోరాటం చేసిన శ్రీనిర్మలాదేవి 500కి పైగా అవార్డులు అందుకున్నారని తెలిపారు. శ్రీమాతాజీ 100వ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా రూ 100ల నాణెం విడుదల చేశారని కెప్టెన్ పి.బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో దూరదర్శన ఆర్టిస్ట్ నెహావర్మ, డాక్టర్ శేషకుమారి, డి.శివరమేష్, ప్రసాద్, స్వాతిప్రియ, ఎల్.వర్మ, మీనాక్షి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇళ్లు కేటాయించాలి : కేవీపీఎస్

ఆరిలోవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న ఇళ్లను వెంటనే కేటాయించాలని కోరుతూ గురువారం చినగదిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నేతలు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు డి.అప్పలరాజు, రైతులు ఎస్.పోమలమ్మ, అర్జునరావు, ఎస్.అప్పారావు, పైడమ్మ, ఎస్.బంగారురాజు, కె.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జియో లీడ్స్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై గురువారం అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు.ఆర్టీసీ కాంప్లెక్స్, రామాటాకీస్ రోడ్డు, వీఐపీ రోడ్డు, దత్ ఐల్యాండ్, సిరిపురం జంక్షన్‌లోని జియో సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి భద్రత నెలను పురస్కరించుకుని జనవరి 1 నుంచి 30 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని జియో ప్రతినిధులు తెలిపారు.

ఏఎస్ రాజా మైదానంలో వైభవంగా చండీయాగం



ఏఎస్ రాజా మైదానంలో నిర్వహిస్తున్న చండీయాగం

ఎంవీపీ కాలనీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎస్ రాజా మైదానంలో గురువారం చండీ యాగం పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీశ్యామలానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమాతంగి ఈశ్వరీదేవి షోడశ నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 8 వరకూ పూజలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మాఘశుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకూ ప్రతి రోజూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రాజమాతంగి పీఠం పురోహితులు పాల్గొంటున్నట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే మంచి మార్గం

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

విశాఖపట్నం (లీగల్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారానే అధిక కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు ప్రయత్నించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ గౌరవాధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. సుప్రీంకోర్టు నుంచి మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీకి చెందిన జాతీయ శిక్షకులు సత్యారావు, రత్నతార విచ్చేసిన సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ గురువారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో న్యాయస్థానాల్లో కొత్తగా దాఖలయ్యే దావాలు, చెక్‌బౌన్స్ కేసులు, ఇతర కేసులు పరిష్కారం కోసం ముందుగా మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపించడం జరుగుతుందన్నారు. జాతీయ శిక్షకులు సత్యారావు, రత్నతార మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో మెళకువలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో అవినీతిపై ఉద్యమం

వినియోగదారుల హక్కుల పరిషత్ జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే



గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే, విశ్వనాథ్, చంద్రశేఖర్ తదితరులు

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై జాతీయస్థాయిలో ఉద్యమాన్ని చేపడుతున్నట్టు వినియోగదారుల హక్కుల పరిషత్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే తెలిపారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం విద్యా వ్యవస్థపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్న విద్యార్థులకు సరైన విద్య లభించడం లేదన్నారు. విద్యను వ్యాపారంగా మారుస్తున్న వారిపై ప్రభుత్వం కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు పీవీజీ విశ్వనాథ్ మాట్లాడుతూ విశాఖ నుంచి ప్రారంభమయ్యే ఈ ఉద్యమాన్ని జాతీయస్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో దొడ్డి చంద్రశేఖర్, చాంద్, ఎ.చంద్రశేఖర్, కేకే చాంద్, విద్యాసాగర్, సుకన్య, వెంకటలక్ష్మి, చంద్రమౌళి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

» కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ రామకృష్ణారావు




సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణారావు, వేదికపై ఈయూబీ రెడ్డి, మురళీమోహన్ తదితరులు

ఎంవీపీ కాలనీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి పర్యావరణాన్ని పరిరక్షించడమే మార్గమని కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే తాగే నీరు, ఆహారం, భూమి, నదులు, చెరువులు సుస్థిరంగా , ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన 16 రకాల ప్లాస్టిక్‌ను వినియోగించకూడదన్నారు. ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి మాట్లాడుతూ నీటిని ప్రతి ఒక్కరూ ఆదా చేయాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ జాతీయ సభ్యుడు ఎంవీవీ మురళీమోహన్, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ప్రతినిధి హనీ, సమత డిగ్రీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, బోటనీ అధ్యాపకులు రాజా ప్రవీణ, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కో-ఆర్డినేటర్ కృష్ణకుమారి, గ్రీన్ రిప్రజెంటేటివ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పరవాడ ఎంపీడీవోపై వేటు

» శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
» వీడియో కాన్ఫరెన్స్‌లో దురుసు ప్రవర్తన, పొంతనలేని సమాధానాలు ఇచ్చారని అభియోగం



ఎంపీడీవో శ్యామ్‌సుందర్(ఫైల్ ఫొటో)

పరవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ పెన్షన్ల పంపిణీకి సంబంధించి కలెక్టర్ బుధవారం ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ దురుసుగా ప్రవర్తించి, సంబంధం లేని సమాధానాలు చెప్పడాన్ని కలెక్టర్ గుర్తించారు. ఇతని వ్యవహారశైలిపై అనుమానం వచ్చి.. విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సిబ్బందిని విచారించారు. డీఎంహెచ్‌వో సమక్షంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. దీనిపై ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీని ఆధారంగా ఎంపీడీవోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో నుంచి సేకరించిన రక్త నమూనాల నుంచి మద్యం వాసన వస్తున్నట్టు గుర్తించి, విశాఖపట్నంలోని ఆర్ఎఫ్ఎస్ ల్యాబ్‌కు పంపారు.

సిబ్బందిపై వేధింపులు

సస్పెన్షకు గురైన పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మద్యం సేవించి విధులకు హాజరవుతుంటారని, తమను వేధిస్తుంటారని మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది వాపోతున్నారు. మహిళలు అని కూడా చూడకుండా దుర్భాషలాడుతుంటారని ఆరోపిస్తున్నారు. ఇతని వేధింపులు భరించలేక ఇటీవల ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవోను తన నివాసానికి పిలిపించి ఆమె మందలించినట్టు తెలిసింది. అయినప్పటికీ ఎంపీడీవో తీరు మార్చుకోలేదు. పైగా సిబ్బంది పట్ల కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం మూడు గంటల సమయంలో మద్యం మత్తులో ఇక్కడ కార్యాలయానికి చేరుకున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాను అడిగిన ప్రశ్నలకు పరవాడ ఎంపీడీవో పొంతన లేని సమాధానం చెప్పడంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసి, ఇతనిపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా ఎంపీడీవో శ్యామ్‌సుందర్ గురువారం కొంతమంది ఉద్యోగులకు (సస్పెండ్ కాకముందు) ఫోన్ చేసి దుర్భాషలాడినట్టు తెలిసింది.

మహాత్ముని జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం



సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు



డాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజంలో కుష్టు రోగులకు నూతన వస్త్రాలు అందజేసిన అతిథులు



మురళీనగర్‌లోని వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వరప్రసాద్, చంద్రమౌళి తదితరులు

సీతమ్మధార/డాబాగార్డెన్స్/మురళీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం సీతమ్మధార, డాబాగార్డెన్స్, మురళీనగర్‌లో పలువురు మహాత్మునికి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీతమ్మధారలోని కార్యాలయం ఆవరణలో మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి డైరెక్టర్‌లు, సీఈఎం లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (ఫైనాన్స్) డి.చంద్రం మాట్లాడుతూ అహింసను మించిన ఆయుధం లేదని ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, బి.అశోక్‌కుమార్, అచ్చి రవికుమార్, జె.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో కుష్టు నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ జి.శాంతారావు ముఖ్య అతిథిగా హాజరై ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అందరూ గాంధీ మార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. అధ్యక్షులు బుద్ధ శివాజీ, ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, ఎంవీకే గుప్తా, ఎస్.గౌరిప్రసాద్‌రావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా డి.సింహాచలం, కోన జగదీశ్వరరావు, సురేష్‌కుమార్, ఎస్.గౌరిప్రసాద్ రావుల ఆధ్వర్యంలో ప్రేమ సమాజం ఆశ్రమవాసులు, బాలబాలికలతో శాంతియాత్ర నిర్వహించారు. మురళీనగర్‌లోని వైశాఖీ స్పోర్ట్సు పార్కు ఆవరణలో గాంధీ స్మారక విగ్రహానికి కమిటీ అధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. మహాత్ముడి ఆశయ సాధనకు మనమంతా పాటుపడాలన్నారు. పార్కు కమిటీ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రమౌళి, వనితా వాకర్స్‌క్లబ్ సభ్యులు, స్థానిక మురళీనగర్ వాసులు హాజరయ్యారు. వాకర్స్ పార్క్‌లో కమిటీ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం, గాంధీజీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో 101 వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నరు కె.ద్వారకానాథ్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి ఫిర్యాదుతో కదిలిన విద్యుత్ యంత్రాంగం



సమస్యలు తెలియజేస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించారు. వార్డులో సమస్యలపై కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం ఇవ్వడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా బాపూజీనగర్, నీలకంఠనగర్, శివలింగపురం, పల్నాటికాలనీ, శ్రీనివాసనగర్, జైభారత్ నగర్ తదితర గ్రామాల్లో మురళీనగర్ సబ్‌స్టేషన్ ఏఈ రాజేష్ తన సిబ్బందితో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నారు. పాడైన విద్యుత్ దీపాల స్థానంలో నూతన దీపాలు ఏర్పాటు చేయడం, విరిగిపోయిన ఇనుప స్తంభాలను మార్చడం తదితర పనులు చేపడుతున్నారు. కొండవాలు గ్రామాల్లో దీర్ఘకాలంగా వెలగని వీధిదీపాలు, స్తంభాల ఏర్పాటు చురుగ్గా జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సీతమ్మధార, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల క్యాలెండర్‌ను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ సీతమ్మధారలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.బాలకాశీ, జిల్లా నాయకుడు క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్ల ప్రధాన సమస్యలపై నాయకులు సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా అన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారన్నారు. ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాల చెల్లింపు వచ్చే నెల నుంచే ప్రారంభిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం ఇన్‌చార్జి సీఐగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



కంచరపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ గా కె.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్ దీర్ఘకాలిక సెలవులో ఉండడంతో అతని స్థానంలో రవికుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కంచరపాలెం స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అరికడతామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌కు ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

ఘనంగా ప్రారంభమైన ఆర్థో వైద్యుల సదస్సు



సదస్సుకు విచ్చేసిన ఆర్థో వైద్య ప్రముఖులు

మహారాణిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్ర స్థాయి సదస్సు శుక్రవారం కేజీహెచ్‌లో ఘనంగా ప్రారంభమైంది. నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల సంఘం, ఆంధ్ర వైద్య కళాశాల, కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజులు ప్రారంభించారు. తొలిరోజు కేజీహెచ్ అనాటమీ విభాగంలో 'కెడావిరిక్ పెల్విఎస్టాబిలర్ సర్జరీ' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ ఎముకల విభాగానికి సంబంధించి నూతనంగా అందుబాటులోకి వస్తున్న వైద్య విధానాలు, విప్లవాత్మక మార్పులు తదితర అంశాలపై అవగాహన అవసరమన్నారు. దేశంలో తొలిసారిగా కేజీహెచ్ అనాటమీ విభాగం ఆధ్వర్యంలో కడావరీ వర్క్‌షాపు నిర్వహించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్ లోక్‌నాథ్, డాక్టర్ వర్మ, వీవీకే తీర్థా, డాక్టర్ రమేష్ సేడాక్టర్, లీలాప్రసాద్, ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. శుక్రవారం కూడా సదస్సు కొనసాగనుంది.

ఆరు జిల్లాల్లో ఎన్నికల కోడ్

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఆరు జిల్లాల పరిధిలో కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆరోజు నుంచి విశాఖ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్టు హరేంధిర ప్రసాద్ తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్లకు గడువు దాఖలుకు ముగుస్తుందని, 11న పరిశీలన జరుగుతుందన్నారు. 13వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. 27వ తేదీన పోలింగ్ జరుగుతుందని, మార్చి మూడో తేదీన ఓటర్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.ఐదు వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే అన్ని రకాల నిబంధనలు వర్తిస్తాయని, అయితే ఎన్నికల ఖర్చు విషయంలో పరిమితి లేదని కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని స్పష్టంచేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని వివరించారు.

123 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఆరు జిల్లాల పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. గత నెల 30వ తేదీ నాటికి 21,555 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారని, వీరిలో పురుషులు 12,948, మహిళలు 8,607 మంది ఉన్నారని వివరించారు. అర్హత కలిగిన వారంతా నామినేషన్ల దాఖలుకు పది రోజుల ముందు అంటే శుక్రవారం సాయంత్రం మూడు గంటల వరకూ ఓటు కోసం దరఖాస్తుచేసుకోవచ్చునని స్పష్టంచేశారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. పదకొండు మండలాలకు ఒక్కొక్కటి చొప్పున, అదనంగా మరొకటి కలిపి మొత్తం 12 మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు బృందాలు, ప్రతి మండలానికి ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్, జడ్పీ సీఈవో, భీమిలి, విశాఖపట్నం ఆర్డీవోలను నోడల్ అధికారులుగా నియమించినట్టు కలెక్టర్ చెప్పారు. నగర డీసీపీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ నగరంలో ఎన్నికల కోడ్ అమలుకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీశంకర్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో భక్తుల తాకిడి



అమ్మవారికి అభిషేకం

జగదాంబ కూడలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శుభకార్యాలు జరిపే మాఘమాసం గురువారం ప్రారంభం కావడంతో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వైష్ణవ ఆలయాలు, అమ్మవార్ల దర్శనానికి భక్తులు ఉత్సాహం చూపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి భవ్యశ్రీ ఎంపిక



భవ్యశ్రీకి ఎంపిక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధికారులు

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరానికి విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థిని పి.భవ్యశ్రీ ఎంపికైంది. ఫిబ్రవరి 5 నుంచి పంజాబ్‌లోని చండీగర్ యూనివర్సిటీలో జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో భవ్యశ్రీ ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల గురువారం తన కార్యాలయంలో భవ్యశ్రీని అభినందించారు. వివిధ రాష్ట్రాల సంస్కృతుల మధ్య ఐక్యత, శాంతిని పెంపొందించడమే ఈ శిబిరం లక్ష్యమని, అందులో తమ విద్యార్థిని పాల్గొంటుండడం గర్వకారణమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కెఎల్.శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ ఎల్.లావణ్య, డాక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అక్కయ్యపాలెం/కంచరపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, కైలాసపురం, శాంతినగర్, సంజీవయ్య కాలనీ, నరసింహనగర్, బీఎస్ లేఅవుట్, ఎన్‌జీజీఓస్ కాలనీ ఏరియా, శ్రీకన్య థియేటర్ ఏరియా, సుబ్బలక్ష్మినగర్, రైల్వే న్యూకాలనీ ప్రధాన రహదారి, రైల్వే న్యూకాలనీ, ఎనభై అడుగుల రోడ్డు, శ్రీనివాసనగర్, మహారాణిపార్లర్ ఏరియా, పుట్టబంగారమ్మ ఆలయం ఏరియా, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, సాయిబాబా ఆలయం ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదని చెప్పారు. కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదు. ఫలితంగా ధర్మానగర్ ఫీడర్‌లో గవరకంచరపాలెం, దుర్గానగర్, రెడ్డికంచరపాలెం, సుభాష్ నగర్, తుమ్మడిపాలెం, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని ఈఈ బీకే నాయుడు కోరారు.

ఉత్సాహంగా ముగిసిన పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడలు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన గిరిజాలలోని సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టుతో అతిథులు



బాలికల ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచిన భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టుతో అతిథులు

కంచరపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ గురువారం ఉత్సాహంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గిరిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ బాలికల విభాగంలో భీమిలి మహిళా కళాశాల విద్యార్థినులు గెలుపొందారు. గురువారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ముగింపు వేడుకలకు ఒలంపియన్, ఇంటర్నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ ఎం.వి.మాణిక్యాలు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు తనదేశానికి ఏదో ఒక మెడల్ తీసుకురావాలని కలలు కని సాధించాలని ఆకాంక్షించారు. సాంకేతిక కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించి వారిలో క్రీడా స్ఫూర్తిని వెలికితీయడం అభినందనీయమన్నారు. కాకినాడ, తిరుపతి ఆర్జేడీలు సత్యనారాయణ మూర్తి, నిర్మలకుమార్ ప్రియ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తే దేన్నైనా సాధించవచ్చునని అన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడలను విజయవంతం చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, ఇతర సిబ్బందిని అభినందించారు. డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, సహ సమన్వయకర్త డా.బి.జానకిరామయ్య, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, పి.లక్ష్మీపతి, పీడీలు అబ్బాస్ బేగ్,కమాల్ బాష, వెంకటేశ్వరావు తదితరులు క్రీడల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అతిథులు విజేతలకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో వ్యక్తిగత చాంపియన్ షిప్ ఎన్. ఈశ్వర్ వర్ధన్ (బాలురు, సాయిగణపతి పాలిటెక్నిక్, గిరిజాల), బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్ షిప్ వి.షణ్ముక ప్రియ (ప్రభుత్వ పాలిటెక్నిక్, చంద్రగిరి, చిత్తూరు రీజియన్), స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ (బాలురు) సాయిగణపతి పాలిటెక్నిక్-గిరిజాల, బాలికల విభాగంలో ఎఎఎన్ఎం పాలిటెక్నిక్ (గుడ్లవల్లేరు-కృష్ణా రీజియన్) గేమ్స్ చాంపియన్‌షిప్ బాలురు విభాగంలో ఆర్యభట్ట పాలిటెక్నిక్, సబ్బవరం విశాఖ రీజియన్, బాలికల విభాగంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, భీమిలి గెలుపొందారు. ముగింపు వేడుకల అనంతరం వీడ్కోలు తీసుకుంటూ కదిలారు.

వాసవీమాతకు పట్టు వస్త్రాలు

డాబాగార్డెన్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్యుల కులదైవం వాసవీమాత ఆత్మార్పణ దినం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి పట్టువస్త్రాలు పంపించేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప తెలిపారు. పెనుగొండలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో కొలువైన కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. తిరుపతిలోని వెంకటేశ్వరస్వామికి, బెజవాడ కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించే విధంగా వాసవి మాతకు కూడా పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. శుక్రవారం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అమ్మవారి భక్తులందరూ పాల్గొనాలని రూప విజ్ఞప్తి చేశారు.

పారా అథ్లెటిక్స్‌కు స్పోర్ట్సు కిట్



కిట్లు అందుకున్న క్రీడాకారులతో కలెక్టర్ తదితరులు

మహారాణిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్పోర్ట్సు కిట్ అందజేశారు. జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో క్రీడాకారులకు టీషర్టు, షార్టు షూస్, రవాణా ఖర్చులను అందజేశారు. పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారిణి జ్యూన్‌గ్యాలియట్ డాక్టర్ కృష్ణ చైతన్య, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్



పి.ఎన్.మూర్తి

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అయిస్టా నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా గురువారం సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. 75 ఏళ్ల పైబడిన వయసులో కూడా ఆటగాళ్లు కోర్టులో ఉత్సాహంగా కదులుతూ బంతిని లక్ష్యం దిశగా పంపుతున్న వారి ఆటతీరు కనువిందు చేయడమే కాకుండా స్ఫూర్తిని కలిగించింది. 75 ప్లస్ డబుల్స్‌లో విశాఖకు చెందిన డి.ఎస్.ఎన్.రాజు-సన్యాసిరాజు జంట 9-6 స్కోరుతో విజయవాడకు చెందిన డి.జి.రెడ్డి-మల్లికార్జున నాయుడు జంటపై గెలుపొందారు. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించారు. ఇక 35 ప్లస్ విభాగంలో తమిళనాడుకు చెందిన కన్నన్ సేతు 9-2 స్కోరుతో విజయనగరానికి చెందిన దీపు చంద్రపై గెలుపొందాడు. 45 ప్లస్ విభాగంలో తమిళనాడుకు చెందిన కెవిఎస్.మూర్తి 9-6 స్కోరుతో రామకృష్ణపై విజయం సాధించాడు. మహిళల విభాగంలో జరిగిన మ్యాచ్‌ల్లో కవిత, శైలజ, రజనీకుమారి, ప్రియదర్శిని తమ ప్రత్యర్థులపై గెలుపొందారు.

దాతలిచ్చినా దయతలచరా?



భక్తుల కోసం దాతలు అందజేసిన కూలర్లు

జగదాంబ కూడలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి ఆలయంలో భక్తుల సౌకర్యం కోసం దాతలు అందజేసిన వాటర్ కూలర్లు పక్కన పెట్టేశారు. మార్గశిర ఉత్సవాల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా, లక్కీషాపింగ్ మాల్ వ్యాపార సంస్థ యజమానులు మూడు కూలర్లు సమకూర్చినట్లు ఆలయ ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వీటిని నిరుపయోగంగా వదిలేయడం చర్చనీయాంశమైంది. క్యూలైన్లలో దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయం లోపల మంచినీటి సౌలభ్యం లేదు. గురు, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వచ్చే భక్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మార్గశిర మాసోత్సవాల్లో సాధారణ ఫిల్టర్ల ద్వారా తాగునీటిని భక్తులకు అందజేసేవారు. ప్రస్తుతం ఇది కూడా కరువైంది. భక్తుల తాగునీటి అవసరాలను గుర్తించి కూలర్లను వెంటనే వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

1న ఉచిత కంటి వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న ద్రోణంరాజు శ్రీవాత్సవ, స్వామి వివేకానంద సేవా సంఘం సభ్యులు

జగదాంబ కూడలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 1న వన్‌టౌన్‌లోని స్వామి వివేకానంద సేవా సంఘం భవనంలో శంకర్ ఫౌండేషన్ నేతృత్వంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్వామి వివేకానంద సేవా సంఘం ప్రతినిధి సూర్యుడు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ద్రోణంరాజు శ్రీవాత్సవ చేతుల మీదుగా ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. శ్రీవాత్సవ మాట్లాడుతూ కంటిమీద కండ, మెల్లకన్ను, కాటారాక్టు శస్త్ర చికిత్సలను ఉచితంగా పేదలకు చేయిస్తామన్నారు. ఉచిత అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. పాతనగరంలోని పేద వర్గాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గ్రేటర్‌లో బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

లెస్‌కు వేశారంటూ వారికే పనులను కేటాయించేస్తున్నారు.

ఇంజనీరింగ్ ఉన్నతాధికారి అండదండలు

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 11 మంది కాంట్రాక్టర్లు బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నారు. వీరు ఎవరైనా ఏదైనా టెండర్‌లో పాల్గొంటే సంబంధిత జోన్ డీఈ వాటిని పరిశీలించి, తిరస్కరించాల్సి ఉంటుంది. కానీ వారు ఎలాంటి అభ్యంతరం చెప్పడం లేదు. పైగా వారే ఎక్కువ లెస్‌కు టెండర్ వేశారంటూ పనులు అప్పగించి అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. మిగిలిన కాంట్రాక్టర్లు ఎవరైనా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తే వారిని పరోక్షంగా అధికారులు బెదిరిస్తున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నప్పటికీ పనులు దక్కించుకుంటున్న ఇద్దరు కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ విభాగంలోని ఒక ఉన్నతాధికారి అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తిగా చేయకపోయినా బిల్లుల చెల్లింపులో అడ్డంకులు లేకుండా ఉండేందుకు సదరు అధికారి నుంచి హామీ లభించడంతోనే భారీగా లెస్‌లకు వేసి టెండర్లు దక్కించుకుంటున్నారని చెబుతున్నారు. సదరు అధికారి నేరుగా ఫోన్ చేసి ఆదేశిస్తుండడంతో తమకు మరో మరోమార్గం లేక వారి టెండర్లను అనుమతిస్తున్నామని డీఈలు గగ్గోలుపెడుతున్నారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టిసారిస్తే భారీగా అక్రమాలు బయటపడతాయని అంటున్నారు.

పింఛన్ల పంపిణీ రేపు

» జిల్లాలో 1,60,757 మందికి రూ.69.74 కోట్లు విడుదల

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి ఒకటోతేదీ శనివారం ఉదయం సామాజిక పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ కేటగిరీలకు చెందిన 1,60,757 మందికి రూ.69.74 కోట్లు విడుదలయ్యాయి. మండలాల్లో 26,604మందికి రూ.11.14 కోట్లు, జీవీఎంసీ పరిధిలో .134,153మందికి రూ.58.6 కోట్లు పంపిణీ చేస్తారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి డబ్బులు అందజేస్తున్నారు. పూర్తిగా మంచానికే పరిమితమై నెలకు రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న 319 మందిపై అధికారుల విచారణ పూర్తయింది. వివరాలు వెల్లడించలేదు.

ఆకాశ్‌కు కలెక్టర్ అభినందనలు



విద్యార్థి ఆకాశ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ హరింధర ప్రసాద్

ఆరిలోవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువచున్న పొన్నకాయల ఆకాష్ రూపొందించిన 'యూజ్ ఆఫ్ మేథ మెడికల్ మోడలింగ్ ఇన్ స్వచ్ఛ భారత్' అను అంశం రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. విజయవాడ మురళి రిసార్ట్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆకాశ్ రూపొందించిన ప్రాజెక్టు ప్రదర్శించాడు. పుదుచ్చేరిలో ఈ నెలలో నిర్వహించనున్న సౌత్ ఇండియా పోటీలకు అర్హత సాధించాడు. ఆకాశ్ ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్ హరేంధర ప్రసాద్ కలెక్టరేట్‌లో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ దేవాలయ హుండీ లెక్కింపు

37 రోజులకు రూ.26,34,775 ఆదాయం

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపును గురువారం ఆలయ కార్యాలయ ఆవరణలో నిర్వహించినట్టు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలియజేశారు. గడిచిన 37 రోజులకు రూ.26,34,775 నగదు వచ్చినట్టు తెలిపారు. వెండి 0-214-800 మిల్లీ గ్రాములు, యూఎస్ఏ 368, సింగపూర్ 12, యూఏఈ డెర్హామ్స్ 50, మలేషియా రింగిట్ 13, ఆస్ట్రేలియా 5 లభించినట్టు తెలిపారు.కార్యక్రమంలో దేవాదాయ శాఖ హుండీల సూపర్‌వైజర్ కే.గాయత్రి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, ఆలయ ఉద్యోగులు జి.గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **మహిష :** రమాదేవి

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 26 దొండకాయలు 34, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్ధచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీర దోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడ దుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఆ రోడ్డులో వెళ్లాలంటే హడల్

» హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాల మార్గంలో సాయంత్రమైతే సమస్యే

» వైన్ షాపు ఏర్పాటవడంతో మద్యం కొనుగోలుకు తాకిడి

» కొత్తగా ఫుడ్ దుకాణాలు వెలియడంతో మరింత రద్దీ



ఒకవైపు మద్యం దుకాణం ముందు నిలిపిన వాహనాలు, మరోవైపు రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ

వెంకోజీపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సాయంత్రం అయితే చాలు ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారుతుంది. రాకపోకలు సాగించే జనం, వాహనాల రద్దీతో ఈ రోడ్డు మహా బిజీగా మారుతుంది. ఇదీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలోని పరిస్థితి.

మార్గంలో ఓ వైన్ షాప్ వెలియడంతో సాయంత్రం వేళ రద్దీగా మారుతోంది. మద్యం కొనుగోలు చేసుకునేందుకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుంటారు. నిత్యం వాహనాల రాకపోకలు, జనం అధికంగా ఉండే ఈ ప్రాంతం వైన్ షాపు వచ్చిన తరువాత మరింతగా రద్దీగా మారింది. దీనికి తోడు ఇటీవల ఈ ప్రాంతంలో ఏర్పడిన మాంసాహార ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల కారణంగా రద్దీ మరింత ఎక్కువైంది. మహిళలు, చిన్నారులు ఈ మార్గంలో సాయంత్రం సమయంలో నడవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మద్యం షాపు ముందు నిలిపిన వాహనాలు

మహాత్ముడికి ఘన నివాళి



సిరిపురం : గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న సర్వోదయ మండల్ సభ్యులు



వెంకోజీపాలెం : ఏయూలోని గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ గాంధీజీ మార్గం అనుసరణీయం అన్నారు. ఆయన ఆచరించిన అహింసావాదం, సత్య, ధర్మ, శాంతి మార్గాలు ప్రపంచానికి గొప్ప సందేశం అన్నారు.

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నినాదం ఇవ్వడమే కాకుండా ఆచరించి చూపడం ద్వారా గాంధీజీ స్ఫూర్తిప్రదాతగా నిలిచారని, సర్వోదయ మండల్ విశాఖ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ త్రినాథ్, హేమ వెంకటేశ్వరి పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అతిథిగా పరవస్తు పద్యపీఠం వ్యవస్థాపకుడు పరవస్తు ఫణి శయనసూరి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండలి ఉపాధ్యక్షులు బీఎస్ చంద్రశేఖర్, డి.తిరుపతి రావు, ఎం.టి.రాజు, డప్పు భాను, ప్రసాద్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఏయూ తత్త్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తత్త్వశాస్త్ర విభాగ పార్య నిర్ధాయక సంఘ అధ్యక్షుడు డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో శాఖాధ్యక్షులు ఆచార్య వానపల్లి వెంకటరావు మాట్లాడుతూ గాంధీజీ అహింసా, సహాయ నిరాకరణ వంటి ఆయుధాలు ఈ ప్రపంచానికి అందించారని, ఈ భూమిపై ప్రేమ, దయ, సహనం ద్వారానే మానవాళి మనుగడ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ అల్లాడ వీరభద్రరావు, డాక్టర్ దేవదానం, డాక్టర్ పద్మజ, డాక్టర్ జె.శ్రీనివాసరావు, డాక్టర్ కల్యాణి, నిర్మల, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూలోని గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ మాజీ రెక్టార్, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఏయూలోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ విగ్రహానికి రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : పెదగదిలి సమీపం సింహగిరి కాలనీలో నిర్వహించిన వేడుకలో గాంధీజీకి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, ఒమ్మి అప్పలరాజు, యల్లమల్లి సురేశ్, మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నేతలు రవిరెడ్డి, పేర్ల విజయచందర్, పాల్గొన్నారు.



ఆరిలోవలో గాంధీజీకి టీడీపీ నేతల నివాళి



కృష్ణా కళాశాలలో జాతిపితకు నివాళి

మహోన్నత నాయకుడు గాంధీ : మేయర్

వెంకోజీపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సత్యం, అహింసా మార్గాలతోనే భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించి తెచ్చి పెట్టిన మహోన్నత వ్యక్తి జాతిపిత, బాపూజీ మహాత్మాగాంధీ అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోని సెంట్రల్ పార్కు వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, బిపిన్ జైన్, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) సత్యవేణి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, జోనల్ కమిషనర్ ఫణిరామ్, ఇతర అధికారులు, ఉద్యోగులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బ్రహ్మశ్రీ రమేష్‌శర్మకు సౌవర్ణ సింహితలాట కంకణ ప్రదానం



రమేష్‌శర్మకు సౌవర్ణసింహతలాట కంకణంతో సన్మానం చేస్తున్న మఠాధిపతులు, ప్రజాప్రతినిధులు

మద్దిలపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో గురువారం శ్రీరమాలక్ష్మీ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయ సహిత, ఇతర దేవాలయాల సమితుల ఆధ్వర్యంలో అక్కాజోస్యుల రమేష్‌శర్మకు సౌవర్ణ సింహతలాట కంకణ ప్రదాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాండవ కాశీ క్షేత్రతపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిమహాస్వామి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బెందాళం అశోక్‌బాబు, సుందరపు విజయకుమార్, బొగ్గు రమణమూర్తి సమక్షంలో రమేష్‌శర్మకు స్వర్ణకంకణం బహూకరించి, సిద్ధాంత శిరోమణి బిరుదుతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంత శక్తివంతుడైనా దైవ సహాయం, దైవ సంకల్పం అవసరమన్నారు. తిరుపతి వివాదం వచ్చినప్పుడు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సనాతన సంప్రదాయ పరిరక్షణ దీక్ష చేపట్టారన్నారు. ఇటీవల చేపట్టిన హైందవ శంఖారావం వంటివి ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో అవసరమన్నారు. సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గజేంద్రమోక్షంలో మొసలి నుంచి రక్షణకు ఏనుగు దేవుడు తప్ప వేరే దిక్కులేదని ప్రార్థించినప్పుడు వెంటనే విష్ణువు వచ్చి రక్షించాడన్నారు. ద్రౌపది వస్త్రాభరణంలో కౌరవ సభలో ఎంతోమంది ఉన్నారు, ఎవరో ఒకరు రక్షిస్తారన్న ఉద్దేశంతో ద్రౌపది ఉండిపోయిందని, చివరిలో కృష్ణుడ్ని వేడుకోవడంతో భగవంతుడు రావడానికి ఆలస్యమైందని అందుకే దేవున్నే ముందు ప్రార్థిస్తే ఆయనే రక్షిస్తాడని నమ్ముతానని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ 200 ఆలయ ప్రతిష్ఠలు పూర్తిచేసిన రమేష్‌శర్మకు సౌవర్ణ సింహతలాట కంకణ ధారణ సన్మాన మహోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ రాజశేఖర్, విజయసాయిరాజు, నిమ్మనదాసు తదితరులు పాల్గొన్నారు.

1న నిర్మలాంజలి ఉత్సవం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, బాబూరావు తదితరులు

పెదవాల్తేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 1వ తేదీన మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో సహజ యోగ ధ్యాన, నిర్మలాంజలి ఫెస్టివల్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కో-ఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. గురువారం పెదవాల్తేరులోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజ యోగాలు తొలుత ప్రారంభించగా, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 149 దేశాల్లో ఉచితంగా సహజ యోగ ధ్యానం కొనసాగుతోందన్నారు. స్వతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీతో కలిసి పోరాటం చేసిన శ్రీనిర్మలాదేవి 500కి పైగా అవార్డులు అందుకున్నారని తెలిపారు. శ్రీమాతాజీ 100వ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా రూ100ల నాణెం విడుదల చేశారని కెప్టెన్ పి.బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో దూరదర్శన ఆర్టిస్ట్ నెహావర్మ, డాక్టర్ శేష కుమారి, డి.శివరమేష్, ప్రసాద్, స్వాతిప్రియ, ఎల్.వర్మ, మీనాక్షి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇళ్లు కేటాయించాలి : కేవీపీఎస్

ఆరిలోవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న ఇళ్లను వెంటనే కేటాయించాలని కోరుతూ గురువారం చినగదిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నేతలు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు డి.అప్పలరాజు, రైతులు ఎస్.పోమలమ్మ, అర్జునరావు, ఎస్.అప్పారావు, పైడమ్మ, ఎస్.బంగారురాజు, కె.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జియో లీడ్స్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై గురువారం అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు.ఆర్టీసీ కాంప్లెక్స్, రామాటాకీస్ రోడ్డు, వీఐపీ రోడ్డు, దత్ ఐల్యాండ్, సిరిపురం జంక్షన్‌లోని జియో సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి భద్రత నెలను పురస్కరించుకుని జనవరి 1 నుంచి 30 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని జియో ప్రతినిధులు తెలిపారు.

ఏఎస్ రాజా మైదానంలో వైభవంగా చండీయాగం



ఏఎస్ రాజా మైదానంలో నిర్వహిస్తున్న చండీయాగం

ఎంవీపీ కాలనీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎస్ రాజా మైదానంలో గురువారం చండీ యాగం పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీశ్యామలానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమాతంగి ఈశ్వరీదేవి షోడశ నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 8 వరకూ పూజలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మాఘశుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకూ ప్రతి రోజూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రాజమాతంగి పీఠం పురోహితులు పాల్గొంటున్నట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే మంచి మార్గం

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

విశాఖపట్నం (లీగల్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారానే అధిక కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు ప్రయత్నించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ గౌరవాధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. సుప్రీంకోర్టు నుంచి మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీకి చెందిన జాతీయ శిక్షకులు సత్యారావు, రత్నతార విచ్చేసిన సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ గురువారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో న్యాయస్థానాల్లో కొత్తగా దాఖలయ్యే దావాలు, చెక్‌బౌన్స్ కేసులు, ఇతర కేసులు పరిష్కారం కోసం ముందుగా మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపించడం జరుగుతుందన్నారు. జాతీయ శిక్షకులు సత్యారావు, రత్నతార మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో మెళకువలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో అవినీతిపై ఉద్యమం

వినియోగదారుల హక్కుల పరిషత్ జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే



గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే, విశ్వనాథ్, చంద్రశేఖర్ తదితరులు

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై జాతీయస్థాయిలో ఉద్యమాన్ని చేపడుతున్నట్టు వినియోగదారుల హక్కుల పరిషత్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే తెలిపారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం విద్యా వ్యవస్థపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్న విద్యార్థులకు సరైన విద్య లభించడం లేదన్నారు. విద్యను వ్యాపారంగా మారుస్తున్న వారిపై ప్రభుత్వం కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు పీవీజీ విశ్వనాథ్ మాట్లాడుతూ విశాఖ నుంచి ప్రారంభమయ్యే ఈ ఉద్యమాన్ని జాతీయస్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో దొడ్డి చంద్రశేఖర్, చాంద్, ఎ.చంద్రశేఖర్, కేకే చాంద్, విద్యాసాగర్, సుకన్య, వెంకటలక్ష్మి, చంద్రమౌళి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

» కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ రామకృష్ణారావు



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణారావు, వేదికపై ఈయూబీ రెడ్డి, మురళీమోహన్ తదితరులు

ఎంవీపీ కాలనీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి పర్యావరణాన్ని పరిరక్షించడమే మార్గమని కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే తాగే నీరు, ఆహారం, భూమి, నదులు, చెరువులు సుస్థిరంగా , ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన 16 రకాల ప్లాస్టిక్‌ను వినియోగించకూడదన్నారు. ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి మాట్లాడుతూ నీటిని ప్రతి ఒక్కరూ ఆదా చేయాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ జాతీయ సభ్యుడు ఎంవీవీ మురళీమోహన్, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ప్రతినిధి హనీ, సమత డిగ్రీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, బోటనీ అధ్యాపకులు రాజా ప్రవీణ, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కో-ఆర్డినేటర్ కృష్ణకుమారి, గ్రీన్ రిప్రజెంటేటివ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పరవాడ ఎంపీడీవోపై వేటు

» శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

» వీడియో కాన్ఫరెన్స్‌లో దురుసు ప్రవర్తన, పొంతనలేని సమాధానాలు ఇచ్చారని అభియోగం



ఎంపీడీవో శ్యామ్‌సుందర్(ఫైల్ ఫొటో)

పరవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ పెన్షన్ల పంపిణీకి సంబంధించి కలెక్టర్ బుధవారం ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ దురుసుగా ప్రవర్తించి, సంబంధం లేని సమాధానాలు చెప్పడాన్ని కలెక్టర్ గుర్తించారు. ఇతని వ్యవహారశైలిపై అనుమానం వచ్చి.. విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సిబ్బందిని విచారించారు. డీఎంహెచ్‌వో సమక్షంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. దీనిపై ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీని ఆధారంగా ఎంపీడీవోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో నుంచి సేకరించిన రక్త నమూనాల నుంచి మద్యం వాసన వస్తున్నట్టు గుర్తించి, విశాఖపట్నంలోని ఆర్ఎఫ్ఎస్ ల్యాబ్‌కు పంపారు.

సిబ్బందిపై వేధింపులు

సస్పెన్షకు గురైన పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మద్యం సేవించి విధులకు హాజరవుతుంటారని, తమను వేధిస్తుంటారని మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది వాపోతున్నారు. మహిళలు అని కూడా చూడకుండా దుర్భాషలాడుతుంటారని ఆరోపిస్తున్నారు. ఇతని వేధింపులు భరించలేక ఇటీవల ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవోను తన నివాసానికి పిలిపించి ఆమె మందలించినట్టు తెలిసింది. అయినప్పటికీ ఎంపీడీవో తీరు మార్చుకోలేదు. పైగా సిబ్బంది పట్ల కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం మూడు గంటల సమయంలో మద్యం మత్తులో ఇక్కడ కార్యాలయానికి చేరుకున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాను అడిగిన ప్రశ్నలకు పరవాడ ఎంపీడీవో పొంతన లేని సమాధానం చెప్పడంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసి, ఇతనిపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా ఎంపీడీవో శ్యామ్‌సుందర్ గురువారం కొంతమంది ఉద్యోగులకు (సస్పెండ్ కాకముందు) ఫోన్ చేసి దుర్భాషలాడినట్టు తెలిసింది.

మహాత్ముని జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం



సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు



డాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజంలో కుష్టు రోగులకు నూతన వస్త్రాలు అందజేసిన అతిథులు



మురళీనగర్‌లోని వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వరప్రసాద్, చంద్రమౌళి తదితరులు

సీతమ్మధార/డాబాగార్డెన్స్/మురళీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం సీతమ్మధార, డాబాగార్డెన్స్, మురళీనగర్‌లో పలువురు మహాత్మునికి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీతమ్మధారలోని కార్యాలయం ఆవరణలో మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి డైరెక్టర్‌లు, సీఈఎం లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (ఫైనాన్స్) డి.చంద్రం మాట్లాడుతూ అహింసను మించిన ఆయుధం లేదని ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, బి.అశోక్‌కుమార్, అచ్చి రవికుమార్, జె.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో కుష్టు నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ జి.శాంతారావు ముఖ్య అతిథిగా హాజరై ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అందరూ గాంధీ మార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. అధ్యక్షులు బుద్ధ శివాజీ, ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, ఎంవీవీకే గుప్తా, ఎస్.గౌరిప్రసాద్‌రావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా డి.సింహాచలం, కోన జగదీశ్వరరావు, సురేష్‌కుమార్, ఎస్.గౌరిప్రసాద్ రావుల ఆధ్వర్యంలో ప్రేమ సమాజం ఆశ్రమవాసులు, బాలబాలికలతో శాంతియాత్ర నిర్వహించారు. మురళీనగర్‌లోని వైశాఖీ స్పోర్ట్స్ పార్కు ఆవరణలో గాంధీ స్మారక విగ్రహానికి కమిటీ అధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. మహాత్ముడి ఆశయ సాధనకు మనమంతా పాటుపడాలన్నారు. పార్కు కమిటీ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రమౌళి, వనితా వాకర్స్‌క్లబ్ సభ్యులు, స్థానిక మురళీనగర్ వాసులు హాజరయ్యారు. వాకర్స్ పార్క్‌లో కమిటీ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో అమర వీరుల సంస్మరణ దినోత్సవం, గాంధీజీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో 101 వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నరు కె.ద్వారకానాథ్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఆర్థో వైద్యుల సదస్సు



సదస్సుకు విచ్చేసిన ఆర్థో వైద్య ప్రముఖులు

మహారాణిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్ర స్థాయి సదస్సు శుక్రవారం కేజీహెచ్‌లో ఘనంగా ప్రారంభమైంది. నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల సంఘం, ఆంధ్ర వైద్య కళాశాల, కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజులు ప్రారంభించారు. తొలిరోజు కేజీహెచ్ అనాటమీ విభాగంలో 'కెడావిరిక్ పెల్విఎస్టాబిలర్ సర్జరీ' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ ఎముకల విభాగానికి సంబంధించి నూతనంగా అందుబాటులోకి వస్తున్న వైద్య విధానాలు, విప్లవాత్మక మార్పులు తదితర అంశాలపై అవగాహన అవసరమన్నారు. దేశంలో తొలిసారిగా కేజీహెచ్ అనాటమీ విభాగం ఆధ్వర్యంలో కడావరీ వర్క్‌షాపు నిర్వహించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్ లోక్‌నాథ్, డాక్టర్ వర్మ, వీవీకే తీర్థా, డాక్టర్ రమేష్ సేడాక్టర్, లీలాప్రసాద్, ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. శుక్రవారం కూడా సదస్సు కొనసాగనుంది.

సీఎండీకి ఫిర్యాదుతో కదిలిన విద్యుత్ యంత్రాంగం



సమస్యలు తెలియజేస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించారు. వార్డులో సమస్యలపై కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్‌కు వినతిపత్రం ఇవ్వడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా బాపూజీనగర్, నీలకంఠనగర్, శివలింగపురం, పల్నాటికాలనీ, శ్రీనివాసనగర్, జైభారత్ నగర్ తదితర గ్రామాల్లో మురళీనగర్ సబ్‌స్టేషన్ ఏఈ రాజేష్ తన సిబ్బందితో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నారు. పాడైన విద్యుత్ దీపాల స్థానంలో నూతన దీపాలు ఏర్పాటు చేయడం, విరిగిపోయిన ఇనుప స్తంభాలను మార్చడం తదితర పనులు చేపడుతున్నారు. కొండవాలు గ్రామాల్లో దీర్ఘకాలంగా వెలగని వీధిదీపాలు, స్తంభాల ఏర్పాటు చురుగ్గా జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సీతమ్మధార, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల క్యాలెండర్‌ను ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ సీతమ్మధారలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.బాలకాశీ, జిల్లా నాయకుడు క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్ల ప్రధాన సమస్యలపై నాయకులు సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా అన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారన్నారు. ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాల చెల్లింపు వచ్చే నెల నుంచే ప్రారంభిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం ఇన్‌చార్జి సీఐగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



కంచరపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ గా కె.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్ దీర్ఘకాలిక సెలవులో ఉండడంతో అతని స్థానంలో రవికుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కంచరపాలెం స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అరికడతామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌కు ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

ఆరు జిల్లాల్లో ఎన్నికల కోడ్

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఆరు జిల్లాల పరిధిలో కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆరోజు నుంచి విశాఖ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్టు హరేంధిర ప్రసాద్ తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్లకు గడువు దాఖలుకు ముగుస్తుందని, 11న పరిశీలన జరుగుతుందన్నారు. 13వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. 27వ తేదీన పోలింగ్ జరుగుతుందని, మార్చి మూడో తేదీన ఓటర్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.ఐదు వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే అన్నిరకాల నిబంధనలు వర్తిస్తాయని, అయితే ఎన్నికల ఖర్చు విషయంలో పరిమితి లేదని కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని స్పష్టంచేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని వివరించారు.

123 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఆరు జిల్లాల పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. గత నెల 30వ తేదీ నాటికి 21,555 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారని, వీరిలో పురుషులు 12,948, మహిళలు 8,607 మంది ఉన్నారని వివరించారు. అర్హత కలిగిన వారంతా నామినేషన్ల దాఖలుకు పది రోజుల ముందు అంటే శుక్రవారం సాయంత్రం మూడు గంటల వరకూ ఓటు కోసం దరఖాస్తుచేసుకోవచ్చునని స్పష్టంచేశారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. పదకొండు మండలాలకు ఒక్కొక్కటి చొప్పున, అదనంగా మరొకటి కలిపి మొత్తం 12 మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు బృందాలు, ప్రతి మండలానికి ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్, జడ్పీ సీఈవో, భీమిలి, విశాఖపట్నం ఆర్డీవోలను నోడల్ అధికారులుగా నియమించినట్టు కలెక్టర్ చెప్పారు. నగర డీసీపీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ నగరంలో ఎన్నికల కోడ్ అమలుకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీశంకర్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో భక్తుల తాకిడి



అమ్మవారికి అభిషేకం

జగదాంబ కూడలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శుభకార్యాలు జరిపే మాఘమాసం గురువారం ప్రారంభం కావడంతో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటికిటలాడాయి. వైష్ణవ ఆలయాలు, అమ్మవార్ల దర్శనానికి భక్తులు ఉత్సాహం చూపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి భవ్యశ్రీ ఎంపిక



భవ్యశ్రీకి ఎంపిక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధికారులు

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరానికి విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థిని పి.భవ్యశ్రీ ఎంపికైంది. ఫిబ్రవరి 5 నుంచి పంజాబ్‌లోని చండీగర్ యూనివర్సిటీలో జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో భవ్యశ్రీ ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల గురువారం తన కార్యాలయంలో భవ్యశ్రీని అభినందించారు. వివిధ రాష్ట్రాల సంస్కృతుల మధ్య ఐక్యత, శాంతిని పెంపొందించడమే ఈ శిబిరం లక్ష్యమని, అందులో తమ విద్యార్థిని పాల్గొంటుండడం గర్వకారణమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కెఎల్.శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ ఎల్.లావణ్య, డాక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడలు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన గిరిజాలలోని సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టుతో అతిథులు



బాలికల ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచిన భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టుతో అతిథులు

కంచరపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ గురువారం ఉత్సాహంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గిరిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ బాలికల విభాగంలో భీమిలి మహిళా కళాశాల విద్యార్థినులు గెలుపొందారు. గురువారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ముగింపు వేడుకలకు ఒలంపియన్, ఇంటర్నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ ఎం.వి.మాణిక్యాలు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు తనదేశానికి ఏదో ఒక మెడల్ తీసుకురావాలని కలలు కని సాధించాలని ఆకాంక్షించారు. సాంకేతిక కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించి వారిలో క్రీడా స్ఫూర్తిని వెలికితీయడం అభినందనీయమన్నారు. కాకినాడ, తిరుపతి ఆర్జేడీలు సత్యనారాయణ మూర్తి, నిర్మలకుమార్ ప్రియ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తే దేన్నైనా సాధించవచ్చునని అన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడలను విజయవంతం చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, ఇతర సిబ్బందిని అభినందించారు. డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, సహ సమన్వయకర్త డా.బి.జానకిరామయ్య, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, పి.లక్ష్మీపతి, పీడీలు అబ్బాస్ బేగ్,కమాల్ బాష, వెంకటేశ్వరావు తదితరులు క్రీడల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అతిథులు విజేతలకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో వ్యక్తిగత చాంపియన్ షిప్ ఎన్. ఈశ్వర్ వర్ధన్ (బాలురు, సాయిగణపతి పాలిటెక్నిక్, గిరిజాల), బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్ షిప్ వి.షణ్ముక ప్రియ (ప్రభుత్వ పాలిటెక్నిక్, చంద్రగిరి, చిత్తూరు రీజియన్), స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ (బాలురు) సాయిగణపతి పాలిటెక్నిక్-గిరిజాల, బాలికల విభాగంలో ఎఎఎన్ఎం పాలిటెక్నిక్ (గుడ్లవల్లేరు-కృష్ణా రీజియన్) గేమ్స్ చాంపియన్‌షిప్ బాలురు విభాగంలో ఆర్యభట్ట పాలిటెక్నిక్, సబ్బవరం విశాఖ రీజియన్, బాలికల విభాగంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, భీమిలి గెలుపొందారు. ముగింపు వేడుకల అనంతరం వీడ్కోలు తీసుకుంటూ కదిలారు.

వాసవీమాతకు పట్టు వస్త్రాలు

డాబాగార్డెన్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల కులదైవం వాసవీమాత ఆత్మార్పణ దినం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి పట్టువస్త్రాలు పంపించేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప తెలిపారు. పెనుగొండలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో కొలువైన కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. తిరుపతిలోని వెంకటేశ్వరస్వామికి, బెజవాడ కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించే విధంగా వాసవి మాతకు కూడా పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. శుక్రవారం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అమ్మవారి భక్తులందరూ పాల్గొనాలని రూప విజ్ఞప్తి చేశారు.

పారా అథ్లెటిక్స్‌కు స్పోర్ట్సు కిట్



కిట్లు అందుకున్న క్రీడాకారులతో కలెక్టర్ తదితరులు

మహారాణిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్పోర్ట్సు కిట్ అందజేశారు. జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో క్రీడాకారులకు టీషర్టు, షార్టు షూస్, రవాణా ఖర్చులను అందజేశారు. పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారిణి జ్యూన్‌గ్యాలియట్ డాక్టర్ కృష్ణ చైతన్య, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్



పి.ఎస్.మూర్తి

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అయిస్టా నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా గురువారం సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. 75 ఏళ్ల పైబడిన వయసులో కూడా ఆటగాళ్లు కోర్టులో ఉత్సాహంగా కదులుతూ బంతిని లక్ష్యం దిశగా పంపుతున్న వారి ఆటతీరు కనువిందు చేయడమే కాకుండా స్ఫూర్తిని కలిగించింది. 75 ప్లస్ డబుల్స్‌లో విశాఖకు చెందిన డి.ఎస్.ఎన్.రాజు-సన్యాసిరాజు జంట 9-6 స్కోరుతో విజయవాడకు చెందిన డి.జి.రెడ్డి-మల్లిఖార్జున నాయుడు జంటపై గెలుపొందారు. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించారు. ఇక 35 ప్లస్ విభాగంలో తమిళనాడుకు చెందిన కన్నన్ సేతు 9-2 స్కోరుతో విజయనగరానికి చెందిన దీపు చంద్రపై గెలుపొందాడు. 45 ప్లస్ విభాగంలో తమిళనాడుకు చెందిన కెవిఎస్.మూర్తి 9-6 స్కోరుతో రామకృష్ణపై విజయం సాధించాడు. మహిళల విభాగంలో జరిగిన మ్యాచ్‌ల్లో కవిత, శైలజ, రజనీకుమారి, ప్రియదర్శిని తమ ప్రత్యర్థులపై గెలుపొందారు.

పరవాడ ఎంపీడీవోపై వేటు

శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

పరవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ పెన్షన్ల పంపిణీకి సంబంధించి కలెక్టర్ బుధవారం ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ దురుసుగా ప్రవర్తించి, సంబంధం లేని సమాధానాలు చెప్పడాన్ని కలెక్టర్ గుర్తించారు. ఇతని వ్యవహారశైలిపై అనుమానం వచ్చి, విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సిబ్బందిని విచారించారు. డీఎంహెచ్‌వో సమక్షంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. దీనిపై ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీని ఆధారంగా ఎంపీడీవోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో నుంచి సేకరించిన రక్త నమూనాల నుంచి మద్యం వాసన వస్తున్నట్టు గుర్తించి, విశాఖపట్నంలోని ఆర్ఎఫ్ఎస్ ల్యాబ్‌కు పంపారు.

సిబ్బందిపై వేధింపులు

సస్పెన్షకు గురైన పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మద్యం సేవించి విధులకు హాజరవుతుంటారని, తమను వేధిస్తుంటారని మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది వాపోతున్నారు. మహిళలు అని కూడా చూడకుండా దుర్భాషలాడుతుంటారని ఆరోపిస్తున్నారు. ఇతని వేధింపులు భరించలేక ఇటీవల ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవోను తన నివాసానికి పిలిపించి ఆమె మందలించినట్టు తెలిసింది. అయినప్పటికీ ఎంపీడీవో తీరు మార్చుకోలేదు. పైగా సిబ్బంది పట్ల కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం మూడు గంటల సమయంలో మద్యం మత్తులో ఇక్కడ కార్యాలయానికి చేరుకున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాను అడిగిన ప్రశ్నలకు పరవాడ ఎంపీడీవో పొంతన లేని సమాధానం చెప్పడంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసి, ఇతనిపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా ఎంపీడీవో శ్యామ్‌సుందర్ గురువారం కొంతమంది ఉద్యోగులకు (సస్పెండ్ కాకముందు) ఫోన్ చేసి దుర్భాషలాడినట్టు తెలిసింది.

1న నిర్మలాంజలి ఉత్సవం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, బాబూరావు తదితరులు

పెదవాల్తేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 1వ తేదీన మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో సహజ యోగ ధ్యాన, నిర్మలాంజలి ఫెస్టివల్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కో-ఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. గురువారం పెదవాల్తేరులోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మీడియో సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజ యోగాలు తొలుత ప్రారంభించగా, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 149 దేశాల్లో ఉచితంగా సహజ యోగ ధ్యానం కొనసాగుతోందన్నారు. స్వతంత్ర పోరాటంలో మహాత్మాగాంధీతో కలిసి పోరాటం చేసిన శ్రీనిర్మలాదేవి 500కి పైగా అవార్డులు అందుకున్నారని తెలిపారు. శ్రీమాతాజీ 100వ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా రూ 100ల నాణెం విడుదల చేశారని కెప్టెన్ పి.బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో దూరదర్శన ఆర్టిస్ట్ నెహా వర్మ, డాక్టర్ శేష కుమారి, డి.శివరమేష్ ప్రసాద్, స్వాతిప్రియ, ఎల్.వర్మ, మీనాక్షి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ రేపు

జిల్లాలో 1,60,757 మందికి రూ.69.74 కోట్లు విడుదల

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి ఒకటోతేదీ శనివారం ఉదయం సామాజిక పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ కేటగిరీలకు చెందిన 1,60,757 మందికి రూ.69.74 కోట్లు విడుదలయ్యాయి. మండలాల్లో 26,604మందికి రూ.11.14 కోట్లు, జీవీఎంసీ పరిధిలో .134,153 మందికి రూ.58.6 కోట్లు పంపిణీ చేస్తారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి డబ్బులు అందజేస్తున్నారు. పూర్తిగా మంచానికే పరిమితమై నెలకు రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న 319 మందిపై అధికారుల విచారణ పూర్తయింది. వివరాలు వెల్లడించలేదు.

గ్రేటర్‌లో బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

లెస్‌కు వేశారంటూ వారికే పనులను కేటాయించేస్తున్నారు.

ఇంజనీరింగ్ ఉన్నతాధికారి అండదండలు

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 11 మంది కాంట్రాక్టర్లు బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నారు. వీరు ఎవరైనా ఏదైనా టెండర్‌లో పాల్గొంటే సంబంధిత జోన్ డీఈ వాటిని పరిశీలించి, తిరస్కరించాల్సి ఉంటుంది. కానీ వారు ఎలాంటి అభ్యంతరం చెప్పడం లేదు. పైగా వారే ఎక్కువ లెస్‌కు టెండర్ వేశారంటూ పనులు అప్పగించి అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. మిగిలిన కాంట్రాక్టర్లు ఎవరైనా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తే వారిని పరోక్షంగా అధికారులు బెదిరిస్తున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నప్పటికీ పనులు దక్కించుకుంటున్న ఇద్దరు కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ విభాగంలోని ఒక ఉన్నతాధికారి అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తిగా చేయకపోయినా బిల్లుల చెల్లింపులో అడ్డంకులు లేకుండా ఉండేందుకు సదరు అధికారి నుంచి హామీ లభించడంతోనే భారీగా లెస్‌లకు వేసి టెండర్లు దక్కించుకుంటున్నారని చెబుతున్నారు. సదరు అధికారి నేరుగా ఫోన్ చేసి ఆదేశిస్తుండడంతో తమకు మరో మరోమార్గం లేక వారి టెండర్లను అనుమతిస్తున్నామని డీఈలు గగ్గోలుపెడుతున్నారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టిసారిస్తే భారీగా అక్రమాలు బయటపడతాయని అంటున్నారు.

త్రిశక్తి ఆలయంలో గుప్త నవరాత్రి ఉత్సవాలు



ఉక్కుటౌన్‌షిప్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో శ్రీశ్యామల (గుప్త) నవరాత్రి మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకలు ప్రారంభం రోజున శ్రీప్రదేవతా అనుగ్రహ పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలోని ముగ్గురు అమ్మవార్లయిన శ్రీమహాదుర్గ, మహాసరస్వతి, శ్రీమహాలక్ష్మి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు చేస్తామని ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ తెలిపారు.

నేడు మరిడిమాంబ, దుర్గామాత ఆలయాల వార్షికోత్సవం

అగనంపూడి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస, ఉక్కు నిర్వాసిత గ్రామాలఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి ఆలయం 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటు గ్రామ పురవీధుల్లో సారె ఊరేగింపు చేపట్టనున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో తీర్థ మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మహిళలతో కోలాటాలు, చెక్క భజనలు, గరిడీలు నిర్వహిస్తునట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే పెదమడక కొండపై వెలసిన దుర్గామాత ఆలయం వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజు తెలిపారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూర్మన్నపాలెం,జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పనుల నిర్వహణ కారణంగా 11 కేవీ వడ్లపూడి ఫీడర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 31న ఉదయం 9.00 గంటలు నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు జోన్-2 ఈఈ బీకె నాయుడు తెలిపారు. వడ్లపూడి, లక్ష్మీపురం, తిరుమలనగర్, సీడబ్ల్యూసీ లైన్, గవర వీధి సిద్ధార్థ నగర్, అపెరెల్ పార్కు, ఆటోనగర్ ఈ బ్లాకు, శ్రీగణేష్ నగర్, కణితి, అంబేడ్కర్ నగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

కారును ఢీకొన్న లారీ

కూర్మన్నపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గాజువాక నుంచి అనకాపల్లి జాతీయ రహదారి వైపు వెళ్తున్న కారును గురువారం వెనుక నుంచి వస్తున్న ఓలారీ ఢీకొంది దీంతో కారు రోడ్డు పక్క ఉన్న గెడ్డలోకి దూసుకుపోయింది. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సినిమా గైడ్

● **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **మహిష :** రమాదేవి
● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడీ, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళాదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 32, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కర్ర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఉక్కు శాఖ మంత్రికి వినతుల వెల్లువ



కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు కార్మిక సంఘ నేతలు



కేంద్రమంత్రికి సమస్యలు నివేదిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్/ పెదగంట్యాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ విచ్చేసిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలకు ఉక్కు కార్మిక సంఘ నాయకులు, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు, అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ప్లాంట్ హెచ్ఆర్డీ భవనంలో ఆయా సంఘాల ప్రతినిధులతో కేంద్రమంత్రి సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుత పరిస్థితులను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగుల సంఖ్య పెంచాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ముఖ్యంగా ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన వారిలో నాయకులు జె.అయోధ్యరాం, కేఎస్ఎన్ రావు, మంత్రి రాజశేఖర్, డొమ్మేటి అప్పారావు, విల్లా రామ్మోహన్‌కుమార్, దాసరి సురేష్‌బాబు, ఎస్సీ ఎస్టీ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు ఉన్నారు.

'ప్యాకేజీ'పై మంత్రులకు టీడీపీ నేతల కృతజ్ఞతలు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ నేతలు

పెదగంట్యాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ సందర్శనకు గురువారం విచ్చేసిన కేంద్ర ఉక్కుశాఖామంత్రి కుమారస్వామి, సహాయమంత్రి శ్రీనివాసరాజుకు పెదగంట్యాడ టీడీపీ నాయకులు ధన్యవాదాలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటువరకు ర్యాలీగా వెళ్లి అక్కడ 'థాంక్యూ సర్ స్టీల్ మినిస్టర్స్' అనే ఫ్లెక్సీలను ప్రదర్శించారు. విశాఖ ఉక్కుకు ఊపిరి పోసేలా రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీమునిరి శ్రీనివాసరావు,సీనియర్ టీడీపీ నాయకులు ములకలపల్లి పెంటయ్య, పులి శ్రీరామరెడ్డి , మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కుమారస్వామికి స్వాగతం పలుకుతున్న కూటమి పార్టీల నేతలు

కేంద్ర మంత్రికి కూటమి నేతల స్వాగతం

గాజువాక/ ఉక్కుటౌన్‌షిప్/ అక్కిరెడ్డిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పాతగాజువాక జంక్షన్‌లో గురువారం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి కూటమి రాజకీయపార్టీల శ్రేణులు ఘనస్వాగతం పలికారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన తరువాత తొలిసారిగా విశాఖ విచ్చేసిన మంత్రికి షీలానగర్ నుంచి స్టీల్‌ప్లాంట్ వరకూఅడుగడుగునా పలు జంక్షన్లలో స్వాగతం పలికారు. పాతగాజువాక జంక్షన్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. పాతగాజువాకలో జాతిపిత గాంధీజీ విగ్రహానికి కేంద్రమంత్రి పూలమాల వేశారు. అనంతరం కేంద్రమంత్రిని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పూలమాలతో సత్కరించారు. కూర్మన్నపాలెం ఆర్చ్ నుంచి స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ వరకు పూల వర్షం కురిపించారు. తదుపరి అంతా కలిసి మంత్రితో బాటుస్టీల్‌ప్లాంట్‌కు వెళ్లారు. షీలానగర్ ఆలయం వద్ద మహిళా కార్యకర్తలు హారతులిచ్చి స్వాగతం పలికారు.

అయితే, కేవలం కేంద్ర మంత్రి పది నిముషాల్లో పర్యటన ముగించుకొని బయలుదేరిపోయారు. ఆయన స్టీల్‌ప్లాంట్, నిర్వాసితుల గురించి ఏమైనా మాట్లాడతారని అంతాఆశించారు. కేంద్ర మంత్రి మాట్లాడకపోవడతో ఆయా వర్గాలు అసంతృప్తికి లోనయ్యారు. మంత్రికి స్వాగతం పలికినవారిలో గాజువాక నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కరణం రెడ్డి నర్సింగరావు, ఈగలపాటి యువశ్రీ, కూనూరు అప్పలరాజు, ఎ వెంకటరావు, అలజంగి దీపక్ తదితర కూటమి నాయకులు ఉన్నారు.

గాంధీజీకి నివాళి



కణితిలో గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ జగన్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ బొండా జగన్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ గాంధీజీ మార్గం అనుసరణీయం అన్నారు. కార్యక్రమంలో కారుమూరి మహేష్, రాజన్‌రాజు, మాటూరి రాము, ప్రగడ దానయ్య, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కాళింగుల వీధిలో 60 వసంతాల గాంధీ విగ్రహానికి స్థానిక నాయకులు ప్రగడ వేణుబాబు, విజయలక్ష్మి ఆధ్వర్యంలో జాతిపితకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రగడ శంకరరావు, శ్రీను, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బి.గోవిందరాజు, గొనప సన్యాసినాయుడు, సత్తిబాబు, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో..

గాజువాక : ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు మహాత్మా గాంధీ, అన్నాప్రగడ కామేశ్వరరావుల వర్ధంతి కార్యక్రమాన్ని చేపలపాలెం ఎంపీ స్కూలులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రను నేటి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి : పెదమడక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్థానిక నేతలు పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విందుల చిరురాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వర్ధంతిని నిర్వహించారు. గాంధీజీ చిత్ర పటానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ : నడుపూరు గాంధీ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్ముడికి జీవీఎంసీ టీడీపీ డెప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాసవి సేవాసంఘం నాయకులు బెల్లాల నాగేశ్వరరావు, పెంటబాబు, బొడ్డు కృష్ణారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ పాల్గొని మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానిక పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.



సీఎం, డెప్యూటీ సీఎం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

కూర్మన్నపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్య వైశ్యుల కుల దైవమైన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, వడ్లపూడి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి మహేష్ పేర్కొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పెనుగొండలో అధికారికంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సీఎంచంద్రబాబు పట్టు వస్త్రాలను సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు ములుకూరి వెంకట రమణ, వీర్రాజు, బెల్లాల పెంటబాబు తదితరులు పాల్గొన్నారు.

సోమనాథేశ్వర వజ్ర లింగ దివ్య స్వర్ణ రథయాత్ర



యాత్రలో పాల్గొన్న 40వ వార్డు ప్రజలు

సింధియా, మల్కాపురం, జనవరి 30, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గురువారం సోమనాథేశ్వర వజ్ర లింగ దివ్య స్వర్ణ రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్‌ని శాలువా కప్పి సత్కరించారు.

మల్కాపురం : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం శ్రీహరిపురం బ్రాంచి ఆధ్వర్యంలో సోమనాథ్ వజ్ర శివలింగం యాత్ర గురువారం పారిశ్రామిక ప్రాంతంలో జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీహరిపురం బ్రాంచ్ ప్రతినిధులు సింధు, మణి, కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, 58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతారాముల పరస పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో ఏటా ఫిబ్రవరి 14న నిర్వహించే సీతారాముల పరస మహోత్సవ గోడపత్రికను గురువారం కాలనీ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక సీతారామ మందిరం వద్ద జరిగిన కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి వంగలపూడి గోపి, స్థానికులు జి.సుబ్రమణ్యం, గుమ్మడి రామాంజనేయులు, ఉప్పాటి సుందర్రావు, ఎ.రాజు, ఉప్పాటి ప్రవీణ్, కండెల్లి శ్రీను పాల్గొన్నారు.

పెంటమాంబ ఆలయానికి విరాళం

పెదగంట్యాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ నిర్వాసిత కాలనీవాసుల ఆరాధ్య దైవం శ్రీపెంటమాంబ ఆలయ అభివృద్ధికి పెదగంట్యాడ సీడబ్ల్యూసీ రూ. 12,000లు విరాళం అందజేసింది. సీడబ్ల్యూసీ కార్యదర్శి ఉరుకూటి రమణయ్య, కోశాధికారి నందికి చిన్నారావు చెక్కును గురువారం ఆలయ కమిటీ డైరెక్టర్లు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పల రెడ్డి లకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యెల్లేటి శ్రీనివాసరావు, డొమ్మేటి అప్పారావు, పిట్ట కుంచారావుతదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ కమిషనర్‌కు అభినందనలు



సింహాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవదాయ శాఖ నూతన కమిషనర్ కోడూరి అచ్యుత రామచంద్రమోహన్ గురువారం సింహాచలం దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో ట్రాన్సిట్ హాల్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయస్వామి దేవస్థానంలో జరిగే రథసప్తమి వేడుకల ఏర్పాట్లకు సంబంధించి గురువారం సమీక్ష సమావేశం నిర్వహిం చారు. కమిషనర్ ఆ సమావేశానికి వెళుతూ మార్గమధ్యలో కొంత సేపు సింహాచలంలో ఆగారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ఈ ప్రాంతానికి రావడంతో దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్, వేద పండితుడు గోదావరి సురేష్ శర్మ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి వేదమంత్రాలతో ఆశీర్వచనాలిచ్చారు. అలాగే జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కార్యాలయ సిబ్బంది, విజయనగరం జిల్లా సహాయ కమిషనర్ వై. శ్రీనివాసరావు, తదితరులు కూడా మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పరశురామరాజుకు అభినందన

పెందుర్తి రూరల్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి) : బీజేపీ విశాఖ జిల్లా శాఖ అధ్యక్షుడిగా నియమితులైన పరశురాం రాజును 95వ వార్డు కార్పొరేటరు ముమ్మన దేముడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పరశురాం రాజుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిక్కాల సతీష్, శ్రీకాంత్, రాపర్తి దుర్గాప్రసాద్, వెంకటేశ్, కంచిబోయిన వెంకట సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

వేపగుంట జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నాయడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా శ్రవణ నక్షత్రం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజామున 4.30 గంటలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు, ఆలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణలో దాదాపు 500 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నాయుడు తోట రవినగర్‌కు చెందిన సూర్యనారాయణ మూర్తి, విజయలక్ష్మి దంపతులు, సత్యశ్రీరామకృష్ణ, గిరిజా సౌజన్యకార్తికేయ కుటుంబీకులు ఆర్థిక సహాయం అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు శ్రీనివాస స్వామి, కల్యాణ వెంకటేశ్వర స్వామి జ్ఞాపిక అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సరఫరాకు అంతరాయం కలగనుంది. పాతగోపాలపట్నం, భగత్ సింగ్ నగర్, నేతాజీ వీధి, ఎర్రచెరువు, గణేశ్ నగర్, ఖారవేలనగర్, నాయుడు క్వార్టర్స్, రైల్వేస్టేషన్ రోడ్డు, రవీంద్రనగర్, విద్యానగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సరఫరా ఉండదని జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

పంచ గ్రామాల ప్రజలు వెతలకు తెర

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞత తెలుపుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూ సమస్య శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న ఆమోదయోగ్యమైన చర్యలు హర్షణీయం.. సీఎం దూరదృష్టితో పంచగ్రామాల ప్రజల వెతలకు తెరపడనున్నదని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్యపై శాశ్వత పరిష్కారానికి కృషిచేసిన చంద్రబాబును ఎమ్మెల్యే పంచకర్ల అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే పంచకర్ల కృతజ్ఞతలు తెలిపారు. భూసమస్య పరిష్కారానికి దేవస్థానం ప్రత్యామ్నాయ భూములు తీసుకోవడానికి, కేసుల ఉపసంహరణకు దేవదాయ శాఖ అధికారులు అంగీకరించడంలో సీఎం చొరవ ప్రశంసనీయమన్నారు. న్యాయస్థానంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన సానుకూల తీర్పు రాగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 12,148 నిర్మాణాలు క్రమబద్ధీకరణ జరగనున్నాయని తెలిపారు,

పెందుర్తిలో రిజిస్ట్రేషన్ల జోరు



రాత్రి 8 వరకు కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు

పెందుర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం క్రయ, విక్రయదారులతో కిటకిటలాడుతోంది. వచ్చే నెల 1 నుంచి ప్రభుత్వం ఆస్తులు విలువ పెంచనున్న క్రమంలో కార్యాలయం పరిధిలోని అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించి తాకిడి పెరిగింది. విలువ పెరిగితే ఆస్తుల రిజిస్ట్రేషన్ భారమవుతుందని భావించి భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి హడావుడి కొనసాగుతోంది. దీంతో గురువారం చినముషిడివాడలో గల పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జోరందుకున్నాయి. సాధారణ దినాల్లో రోజుకు ఐదు నుంచి పది డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అవుతుండేవి. గురువారం ఏకంగా 50 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం. ఈ డాక్యుమెంట్ల ద్వారా సుమారు రూ.కోటి ఆదాయం లభించిందని కార్యాలయ సిబ్బంది తెలిపారు. రాత్రి 8 వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి.రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు జోరందుకోవటంతో సర్వర్ మందగించి కొన్ని నిమిషాలు నిలిచిపోవడం, రిజిస్ట్రేషన్లలో కొంత జాప్యం నెలకొందని క్రయ, విక్రయ విక్రయదారులు అసహనం వ్యక్తం చేశారు.

నేడు శ్రీహరిపురంలో అమ్మవార్ల పరస



మల్కాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం వాసుల ఆరాధ్య దేవతలు దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల పరస (మహోత్సవం)ను శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 1981 జనవరి 31 నుంచి నిర్వహిస్తున్న పరసలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు వచ్చి దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్లను దర్శించుకుంటారు. ఈ ఆలయాలను 1930లో గ్రామానికి దూరంగా నిర్మించారు. అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన స్థలాన్ని మొల్లి కుటుంబీకులు (యాదవులు) గ్రామానికి ఇచ్చారు.95 ఏళ్లుగా ప్రజలు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తూనే ఉన్నారు. సంక్రాంతి పండుగ తరువాత పరసల సంస్కృతి ప్రారంభమైన నేపథ్యంలో శ్రీహరిపురంలోనూ నిర్వహించాలని భావించిన నాటి పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారు. 1996లో పురాతన ఆలయాలను తొలగించి, 1998లో కొత్తగా నిర్మించారు. శ్రీహరిపురం వాసులు పరస కోసం ఎదురుచూస్తుంటారు.

ట్రాఫిక్ మళ్లింపు

శ్రీహరిపురంలో పరస నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి పది వరకు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు హార్బర్ సర్కిల్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, మల్కాపురం ట్రాఫిక్ ఎస్సై అప్పారావు తెలిపారు. సింధియా నుంచి గాజువాక వైపు వెళ్లే వాహనదారులు రామకృష్ణపురం సెయింట్ ఆన్స్ కాలేజీకి వెళ్లే మార్గం నుంచి జనతాకాలనీ చేరుకొని అక్కడి నుంచి అదే మార్గం గుండా గాజువాక చేరుకోవాలి. అలాగే గాజువాక నుంచి మల్కాపురం, నగరంలోకి చేరుకోవాలనుకొనేవారు కోరమాండల్ గేటు ఎదురుగా ఉన్న మాజీ సైనికుల కాలనీ నుంచి జనతాకాలనీ మీదుగా త్రినాథ్‌పురం నుంచి చేరుకోవచ్చు. పరస రద్దీ లేకపోతే శ్రీహరిపురం ఓ మార్గం ద్వారా వాహనాలు పంపే అవకాశం పరిశీలిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

మాఘ మాసంలో అప్పన్న ఆలయంలో ఉత్సవాలు

సింహాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో మాఘ మాసంలో జరిగే ఉత్సవాలను అధికారులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వచ్చే నెల 4న సూర్య జయంతి సందర్భంగా ఉదయం స్వామివారి స్నపన తిరుమంజనం, విశేష ఆరాధనలు ఉంటాయి.సాయంత్రం సూర్యప్రభ వాహనంపై సింహగిరి మాడవీధుల్లో తిరువీధి, 7, 8వ తేదీల్లో సింహాచలం దేవస్థానం అనుబంధాలయాలు కొండదిగువ వేంకటేశ్వరస్వామి, మాధవధారలోని వేణుగోపాలస్వామి, సింహగిరి క్షేత్రపాలకుడు బాల త్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామివార్ల వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు, 10న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గంగధార సమీప సీతారామస్వామి దేవాలయంలో సంక్షిప్త రామాయణం హవనం, 11న స్వామివారి మాస జయంతి, 12న మాఘపూర్ణిమ పురస్కరించుకుని అనుబంధ దేవాలయాల్లో అవబృధోత్సవం, 13న కుంభ సంక్రమణం సందర్భంగా అనుబంధాలయాల్లో పుష్ప యాగం, 14న సింహవల్లీ తాయార్ బేడమండప తిరువీధి, పుబ్బ ఆండాళ్ మాస తిరు నక్షత్ర పూజలు జరగనున్నాయి. అలాగే 19న స్వాతి హవనం, 20న విశాఖ నక్షత్రం నమ్మాళ్వార్ తిరు నక్షత్రం, 23న మూల నక్షత్ర మనవాళ్ల మహామునుల తిరు నక్షత్రం, 24న మాఘమాస బహుళ ఏకాదశి స్వామివారికి స్వర్ణ తులసీదళార్చన, మాడవీధుల్లో తిరువీధి, 26న మహాశివరాత్రి, 28న మాఘమాస బహుళపక్ష అమావాస్య, గ్రామ బలిహరణం, గ్రామ తిరువీధి నిర్వహించనున్నారు.

'యువత గాంధీజీ బాటలో నడవాలి'

మల్కాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో మహాత్మగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని పలుచోట్ల నిర్వహించారు. శ్రీహరిపురంలోని మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే 59వ వార్డు హిమాచల్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలోనూ అంజలి ఘటించారు.

మాంగనీస్ ఖనిజం హ్యాండ్లింగ్‌లో విశాఖ పోర్టు నూతన రికార్డు

» 24 గంటల్లో 22,746 టన్నుల లోడింగ్

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు మాంగనీస్ ఖనిజం హ్యాండ్లింగ్‌లో నూతన రికార్డు నెలకొల్పింది. వీఎస్‌పీఎల్ బెర్త్ (ఈస్ట్ క్వే-8)కు ఈ నెల 29న ఎంవీ ఎన్‌బీ వైవా నౌక రాగా అందులోకి 22,746 టన్నుల మాంగనీస్ ఖనిజాన్ని రికార్డు సమయం (24 గంటల వ్యవధి)లో లోడింగ్ చేయడం జరిగింది. గత ఏడాది ఆగస్టు 4వ తేదీన ఎంవీ సోమంత్ నౌక ఈస్ట్ క్వే-7 బెర్త్ వద్దకు రాగా అందులోకి 22,359 టన్నుల మాంగనీస్ లోడింగ్ చేసి రికార్డు సాధించింది. దానిని ఇప్పుడు పోర్టు అధిగమించింది. బోత్రా షిప్పింగ్ దీనికి ఏజెన్సీగా వ్యవహరించింది.

విశాఖపట్నం పోర్టు 2024 ఏప్రిల్ నుంచి ఈ జనవరి 29వ తేదీ వరకు 98 నౌకల ద్వారా 31,34,058 టన్నుల మాంగనీస్ ఖనిజాన్ని హ్యాండ్లింగ్ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి 25.14 లక్షల టన్నులు చేసింది. బల్క్ కార్గో ఎగుమతిలో గణనీయమైన వృద్ధిని సాధించినట్టు పోర్టు వర్గాలు తెలిపాయి.

ఉత్సాహంగా కేంద్ర మంత్రుల పర్యటన



గజమాలతో మంత్రులకు స్వాగతం

స్టీల్‌ప్లాంటును సందర్శించేందుకు గురువారం నగరానికి వచ్చిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మలకు ఎయిర్‌పోర్టు నుంచి స్టీల్‌ప్లాంటు వరకు పలు కూడళ్లలో ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు తదితరులు స్వాగతం పలికారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



అభిమానులకు అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మ. చిత్రంలో రాష్ట్ర మంత్రి సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, కలిశెట్టి అప్పలనాయుడు, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



స్టీల్‌ప్లాంట్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కుమారస్వామి. చిత్రంలో సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు ఎం.శ్రీభరత్, అప్పలనాయుడు ఉన్నారు

'స్టీలు ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి'



దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

కూర్మన్నపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారానికి గురువారం వచ్చిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కాన్వాయ్‌ని ఉక్కు కార్మికుల దీక్షా శిబిరం వద్ద పదినిమిషాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా కార్మికులు స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలనీ, సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ విరమించుకోవాలని నిరసన తెలిపారు. అయితే శిబిరం వద్ద కాన్వాయ్‌ను నిలిపినప్పటికీ మంత్రులు శిబిరం వద్దకు రాకుండా వెళ్లిపోవడాన్ని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు ఖండించారు.

గాంధీ చరిత్ర స్ఫూర్తిదాయకం: కలెక్టర్



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

మహారాణిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ జీవిత చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్ముని ప్రస్తావన లేకుండా దేశ చరిత్ర ఉండదని, ఆయన చూపిన మార్గాన్ని అందరూ అనుసరించడమే ఘనమైన నివాళి అన్నారు. డీఆర్‌వో భవానీ శంకర్, ఈవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంతు హింసను నిరోధించాలి

మూగజీవాల పట్ల ప్రేమ, కరుణతో వ్యవహరించాలని, చట్టం అమలులో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జీవహింస నిరోధక చట్టం అమలు తీరుపై సమీక్షించారు. వెంకోజీపాలెం గోశాలలో ఆవుల మరణంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అవసరమైతే గోశాల అనుమతిని రద్దు చేస్తామని హెచ్చరించారు అనధికార వధ శాలలపై పోలీసులు తనిఖీలు చేయాలన్నారు. వీధి కుక్కల సంతతి నిరోధానికి రోజుకు 150 శస్త్రచికిత్సలు చేయాలని సూచించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ జేడీ డా.రామకృష్ణ, జీవీఎంసీ అధికారి డాక్టర్ కిశోర్, 18 శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

» జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆర్పీల నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఆర్పీలు

సిరిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ సాక్షిగా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మెప్మా ఆర్పీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ గౌరవాధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. ఆర్పీలకు ఇచ్చిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దుచేయాలని కోరుతూ గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో చేసిన ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కాల పరిమితి సర్క్యులర్ రద్దుచేస్తామని, వేతనాలు వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రాజకీయ పార్టీల వ్యక్తులను ఆర్పీలను పరిగణించవద్దని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లీశ్వరి, లత, ఝాన్సీ, సత్య, వరలక్ష్మి, లక్ష్మి, జయ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ విజేత విశాఖ

మునగపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందీశ్వర ప్రాంగణంలోని తులసీ కళావేదిక వద్ద ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. ఉత్కంఠ భరితంగా జరిగిన పోటీలలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచిందని నిర్వాహకులు చెప్పారు. ఏటికొప్పాక జట్టు ద్వితీయ, ఎలమంచిలి జట్టు తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నాయి. విజేతలకు షీల్డ్, నగదును బహుమతులుగా అందజేశారు. విజేతలను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో కాలిపోయిన బైక్

ఆరిలోవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హనుహను మంతువాక కూడలి సమీపంలో గురువారం రాత్రి జరిగింది. సింహాచలం నుంచి బీఆర్‌టీఎస్ వస్తున్న కారు ఎదురుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వాహన చోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని వెంటనే విమ్స్‌కు తరలించారు. కాగా ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి వాహనం దగ్ధమైంది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

దారి దోపిడీ కేసులో నలుగురి అరెస్టు

సీతంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పని ముగించుకొని వెళ్తున్న వ్యక్తిని ఆటోలో వచ్చిన నలుగురు అడ్డగించి రూ.వెయ్యి లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ద్వారకా పోలీసులు నిందితులను గురువారం అరెస్టు చేశారు. విజయనగరం జిల్లా రామభద్రపురానికి చెందిన మూడడ్ల శ్రావణ్ కుమార్ ఈ నెల 28న రాత్రి సుమారు పది గంటల సమయంలో డైమండ్ పార్కు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ఆటోలో నలుగురు వచ్చి అతడిని కొట్టి జేబులో ఉన్న రూ.వెయ్యి లాక్కున్నారు. దీంతో శ్రావణ్ కుమార్ ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చక్రవర్తి ఆధ్వర్యంలో క్రైమ్ ఎస్ఐ రాజు, ఏఎస్ఐ కిశోర్, కానిస్టేబుల్ అప్పలరాజు, ఆరిలోవ క్రైమ్ ఎస్ఐ హరికృష్ణ బృందాలుగా విడిపోయి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో మారికివలస కాలనీకి చెందిన లాగం అఖిక్ రామసాయి, తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీకి చెందిన రొంగలి గణేష్, బోయపాలేనికి చెందిన పచ్చిగుళ్ల కేదారనాథ్ అలియాస్ రవితో పాటు మరో బాలుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.వెయ్యి స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. పోలీసు సిబ్బందిని డీసీపీ, ఏసీపీలు అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై కత్తితో దాడి

భీమునిపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులో వాకింగ్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వాసుపల్లి నవీన్ (27)పై పాత కక్షల నేపథ్యంలో పుక్కళ్ల దాసు (45) కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మారిటెక్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న నవీన్‌కు రాత్రి డిన్నర్ చేసిన తర్వాత కాసేపు వాకింగ్ చేయడం అలవాటు. బుధవారం రాత్రి బీచ్‌రోడ్డులో వాకింగ్ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన దాసు వచ్చి గతంలో ఇద్దరి మధ్య జరిగిన సంఘటనను గుర్తు చేస్తూ హెయిర్ సెలూన్‌లోని కత్తితో దాడి చేశాడు. దీంతో నవీన్ తొడ, వీపుపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సుధాకర్, ఎస్ఐ హరీష్ నిందితుడ్ని అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: ఆర్ఐవో

మద్దిలపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో మురళీధర్ సూచించారు. పిఠాపురంకాలనీలోని ఇంటర్ బోర్డు జిల్లా కార్యాలయంలో గురువారం డెక్ మెంబర్స్, బల్క్ రిలీజ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాక్టికల్, థియరీ పరీక్షల ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు ముందుగానే మెటీరియల్ చేరవేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని, ప్రాక్టికల్స్‌కు ఏర్పాటు చేసిన 167, థియరీపరీక్షలు నిర్వహించే 87 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమన్వయం చేసుకుని పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు.

గుర్తింపు పొందిన భవనాల్లోనే తరగతులు

జిల్లాలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు గుర్తింపుపొందిన భవనాల్లోనే తరగతులు నిర్వహించాలని ఆర్ఐవో తెలిపారు. ఇతర భవనాల్లో నిర్వహిస్తే ఇంటర్ విద్యామండలి నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు కళాశాలలోచేరినప్పుడు వారి పదో తరగతి ఒరిజనల్ సర్టిఫికెట్లు తిరిగి అందజేయాలని సర్క్యులర్ జారీ చేశామని తెలిపారు. కొన్ని కళాశాలలు దీనిని పట్టించుకోకుండా ఇప్పటికీ తమ వద్ద ఉంచుకోవడం విద్యార్థుల హక్కులను ఉల్లంఘించడమేనన్నారు. వెంటనే వారి ఒరిజనల్స్ వెనక్కి ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ఇబ్బందులకు గురిచేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అధికారులతో సమావేశమైన ఆర్ఐవో మురళీధర్

క్రైం... crime news

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం



దేవర సంజీవ్ (ఫైల్‌ఫొటో)

మర్రిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు వేధిస్తుండడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుచ్చిరాజుపాలెంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు దేవర సంజీవ్ (52) అలియాస్ పైసలోడు భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలతో బుచ్చిరాజుపాలెం గొల్లవీధిలోఉంటున్నాడు. కరాస ప్రాంతంలో ఇసుక ఎగుమతి, దిగుమతి కూలీగా పనిచేస్తుండేవాడు. బుధవారం పనికి వెళ్లి సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకుంటానని గదిలోకి వెళ్లాడు. కొంత సమయం తరువాత భార్య లక్ష్మి అతనికి టీ ఇచ్చేందుకు వెళ్లగా గది తలుపులు వేసి ఉండడంతో కుమారుడికి చెప్పింది. అతడు తన స్నేహితుడి సహాయంతో తలుపులు తెరిచి చూసేసరికి డోర్ కర్టెన్‌తో గదిలో ఉన్న ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. సిబ్బంది సూచన మేరకు కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. సంజీవ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అనారోగ్య సమస్యలే ఆత్మహత్యకు కారణమని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. భార్య దేవర లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు.

నేవీ ఉద్యోగి ఆత్మహత్య



సంతోష్ (ఫైల్ ఫొటో)

భీమునిపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపులుప్పాడలో నేవీ ఉద్యోగి శీరముళ్ళ సంతోష్ (25) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని శ్రీహరిపురానికి చెందిన సంతోష్ బీచ్‌రోడ్డులోని ఐఎన్ఎస్ కళింగలో మల్టీ టాస్క్ స్టాఫ్ ఎంటీఎస్‌గా పనిచేస్తున్నాడు. అతని తండ్రి దోబీగా పనిచేస్తుండగా, తల్లి ఇంటి గృహిణి. సంతోష్‌కు నేవీలో ఉద్యోగం రావడంతో కాపులుప్పాడలో ఇల్లు అద్దెకు తీసుకుని స్నేహితుడు యశ్వంత్ సాయి, అతడి సోదరి ఉంటున్నారు. ప్రతిరోజూ ముగ్గురూ వారి పనులకు వెళుతుంటారు. గురువారం ఉదయం అలానే వెళ్లగా మధ్యాహ్నం సంతోష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ జి.హరీష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కాగా మృతుడి తల్లిదండ్రులు సూరిబాబు, అచ్చియ్యమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె కాగా కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడికి 2021లో నేవీలో ఉద్యోగం వచ్చింది. రెండేళ్ల క్రితం వరకూ అతను చినవాల్తేరులోని తన పిన్ని ఇంటి నుంచి విధులకు వెళ్లి వస్తుండేవాడు. గత ఏడాదే కాపులుప్పాడలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడు అర్థాంతరంగా తనువు చాలించడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బాలికను గర్భవతిని చేసిన నిందితుడికి రిమాండ్

మల్కాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయమాటలు చెప్పి ఆమె గర్భవతి కావడానికి కారకుడైన యశ్వంత్‌పై మల్కాపురం పోలీసులు పోక్సో రేప్ కేసులు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు పంపారు. కొంతకాలంగా యశ్వంత్ బాలికను పలుమార్లు లొంగతీసుకున్నాడు. ఇటీవల ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తడంతో కేజీహెచ్‌కు వెళ్లగా విషయం బయటపడింది. మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ) అందుకున్న పోలీసులు బాలికను విచారించగా విషయాన్ని చెప్పింది. దీంతో యశ్వంత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళిదాస్ కేసు నమోదు చేశారు.

20 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ రైల్వే పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. జీఆర్పీ ఎస్ఐ రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి ప్లాట్‌ఫారాలపై తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన సాగర్ ప్రధాన్ గూడూరు, నెల్లూరు మీదుగా వెళ్లే రైల్లో గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకుని రూ.50 వేలు విలువ చేసే 10 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, జీఆర్పీ ఎస్ఐ కెటిఆర్.లక్ష్మి తనిఖీలు చేస్తుండగా ఉత్తరాఖండ్‌కు చెందిన సురేష్‌కుమార్, రాయగడ వాసి కిరణ్ లామా కోల్‌కతాకు గంజాయి తరలిస్తుండగా పట్టుకుని వారి వద్ద నుంచి రూ.50 వేలు విలువ చేసే 10 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ముగురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని రైల్వే పోలీసులు తెలిపారు.